# ప్రజాస్వరం
PRAJASWARAM
తెలుగు దినపత్రిక

MHR TV

మెదక్ | సంపుటి: 19 సంచిక : 96 | మంగళవారం 09, డిసెంబర్ 2025 | పేజీలు: 06 | వెల: రూ.1

Circulated By: Hyderabad-Medak-Sangareddy-Nalgonda-Warangal-Nizamabad-Adilabad -Vijayawada-Guntur-Vizag-Kurnool | www.prajaswaramdaily.com


## పూలమ్మిండు.. పాలమ్మిండు..
# వేల ఎకరాలు కబ్జా పెట్టిండు!

**మల్లారెడ్డి పూలు, పాలు అమ్మి వేల ఎకరాలు కబ్జా చేశారని ఆరోపణ**

**మేడ్చల్‌లో కనీస వసతులు కల్పించడంలో విఫలమయ్యారని విమర్శ**

**భూముల క్రమబద్ధీకరణలో అవకతవకలపై సుప్రీంకు వెళ్తానని వెల్లడి**



**హైదరాబాద్, (ప్రజాస్వరం):**
తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత మాజీ మంత్రి, మేడ్చల్ ఎమ్మెల్యే మల్లారెడ్డిపై తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. మేడ్చల్‌లో పూలు, పాలు అమ్ముకొని వేల ఎకరాలు కబ్జా చేశారే తప్ప, గతంలో మంత్రిగా, ప్రస్తుతం ఎమ్మెల్యేగా ఉన్న మల్లారెడ్డి పేదలకు చేసిందేమీ లేదని విమర్శించారు. 'జాగృతి జనంబాట' కార్యక్రమంలో భాగంగా నిన్న ఆమె మేడ్చల్ నియోజకవర్గంలో పర్యటించారు. ముందుగా జవహర్‌నగర్ డంపింగ్‌యార్డును ..మిగతా 2లో

## రోస్టరింగ్ నిబంధనలు
# పాటించలేదు

అందుకే ఇండిగో సంక్షోభం తలెత్తింది

ఈ సమస్యపై తీవ్రంగా దృష్టి సారించాం

డీజీసీఏ నిబంధనలు పాటించాల్సిందే

సమస్య పరిష్కారానికి కమిటీ వేశాం

పార్లమెంటులో పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు



**న్యూఢిల్లీ, (ప్రజాస్వరం):**
దేశ అతిపెద్ద విమానయాన సంస్థ ఇండిగో గత కొద్ది రోజులుగా ఎదుర్కొంటున్న తీవ్ర సేవా అంతరాయాలకు కారణం ఏవియేషన్ మేనేజ్‌మెంట్ సిస్టమ్ సాఫ్ట్‌వేర్ కాకుండా, పైలట్లు-క్యాబిన్ క్రూ సిబ్బంది పని గంటలు, రోస్టరింగ్ నిబంధనలను సంస్థ సరిగా అమలు చేయకపోవడమేనని పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు సోమవారం పార్లమెంట్‌లో స్పష్టం చేశారు. రాజ్యసభలో ప్రశ్నోత్తర సమయంలో ఇండిగో సంక్షోభంపై విపక్షాలు చర్చ డిమాండ్ చేయడంతో ..మిగతా 2లో

## తెలంగాణ ఆగ్రోస్ భూమిని
# కాపాడిన హైడ్రా

**కబ్జాలకు ఆస్కారం లేకుండా కంచె నిర్మాణం**

**ప్రహరీలు నిర్మించి షెడ్లు వేసి ఆక్రమణలు కిరాయిలకు ఇచ్చి రూ. లక్షల్లో వసూలు**




## వందేమాతరంపై
# చర్చ ఎందుకు ?

**ఎన్నికల హడావుడిలో దేశ ప్రయోజనాలు మరచారా?**

**వందేమాతరం రాజకీయీకరణపై ప్రియాంక ఆగ్రహం**

**మేము దేశం కోసం పోరాడతామంటున్న ప్రియాంక గాంధీ**

**పార్లమెంట్ సభలో బీజేపీ పై ప్రియాంక ఫైర్**






## తెలంగాణ రైజింగ్
# అన్‌స్టాపబుల్..
## మూడు ట్రిలియన్ డాలర్ల ఆర్థిక లక్ష్యం..!

**గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ చేతుల మీదుగా 'తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్' ప్రారంభం.**

**రాష్ట్ర అభివృద్ధికి సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వం కీలకమన్న గవర్నర్**

**సమ్మిట్‌లో పెట్టుబడులు, ఉపాధి, ఇన్నోవేషన్ అంశాలపై 27 ప్రత్యేక సెషన్లు**

**'తెలంగాణ రైజింగ్ 2047 విజన్'ను నిపుణుల సహకారంతో సిద్ధం చేశాం: సీఎం రేవంత్ రెడ్డి**

**తెలంగాణ 2034 నాటికి 1 ట్రిలియన్ డాలర్లు, 2047 నాటికి 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా మారడమే లక్ష్యం**

**హైదరాబాద్, (ప్రజాస్వరం):**
తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ ఘనంగా ప్రారంభమైంది. సమ్మిట్‌ను గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ ప్రారంభించారు. తెలంగాణ 2047 నాటికి 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా ఎదగాలని ఆశాభావం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలకు సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వం దోహదపడుతోందని గవర్నర్ పేర్కొన్నారు. సమ్మిట్‌లో సీఎం రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, రాష్ట్ర మంత్రులు, కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి, దేశ విదేశాల నుంచి వచ్చిన ప్రముఖ పారిశ్రామిక వేత్తలు, పెట్టుబడిదారులు పాల్గొన్నారు. పెట్టుబడులు, ఉపాధి, ఇన్నోవేషన్ ప్రధాన లక్ష్యంగా 27 అంశాలపై ప్రత్యేక సెషన్లు నిర్వహిస్తున్నారు. సీఎం రేవంత్ రెడ్డి తన ప్రసంగంలో తెలంగాణ భవిష్యత్ విజన్‌ను ..మిగతా 2లో

# బెంగళూరుతో హైదరాబాద్ పోటీ

**ఈ రెండు నగరాలు ప్రపంచంతో పోటీ పడుతున్నాయి**

**భవిష్యత్ దృష్టిలో ఉంచుకొని తెలంగాణ ప్రణాళికలు**

**దేశ ఐటీ ఎగుమతుల్లో 40 శాతం వాటా బెంగళూరుదే**

**కర్ణాటక డిప్యూటీ సీఎం డీకే శివకుమార్**



**హైదరాబాద్, (ప్రజాస్వరం):**
అభివృద్ధి, పెట్టుబడులు, ఐటీ రంగంలో బెంగళూరుతో హైదరాబాద్ నగరం సమంగా పోటీ పడుతోందని, ఈ రెండు మహానగరాలు ఇప్పుడు ప్రపంచంతోనే పోటీ పడే స్థాయికి ఎదిగాయని కర్ణాటక ఉప ముఖ్యమంత్రి డీ.కె. శివకుమార్ కొనియాడారు. హైదరాబాద్‌లోని హైటెక్ సిటీ సమీపంలో గచ్చిబౌలిలోని ఫ్యూచర్ సిటీలో శనివారం నిర్వహించిన 'తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ 2025'లో ..మిగతా 2లో

## అది నిరూపిస్తే నేను
# రాజీనామాకి సిద్ధం!

**రెండేళ్ల కాంగ్రెస్ పాలన పూర్తిగా విఫలమైందని హరీశ్ రావు విమర్శ**

**రుణమాఫీపై సీఎం రేవంత్ రెడ్డికి రాజీనామా సవాల్**

**ఫార్మా సిటీ, మెట్రో వంటి ప్రాజెక్టులను రద్దు చేశారని ఆరోపణ**

**తాగుబోతుల తెలంగాణ వైపు కాంగ్రెస్ అడుగులు**

**జాబ్ నోటిఫికేషన్ ఇవ్వలేదు కానీ.. మద్యం దుకాణాలకు నోటిఫికేషన్**



**హైదరాబాద్, (ప్రజాస్వరం):**
తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం రెండేళ్ల పాలనలో ప్రజలకు మొండి చేయి చూపిందని, పాలన పూర్తిగా ఆగమాగంగా ఉందని బీఆర్ఎస్ సీనియర్ నేత, మాజీ మంత్రి హరీశ్ రావు విమర్శించారు. పూర్తిస్థాయి రుణమాఫీ జరిగిందని ..మిగతా 2లో

## హైదరాబాద్ కేవలం
# రాజధాని కాదు..
## దేశ అర్థిక వ్యవస్థకు మూలస్తంభం


**ఐటి, ఇన్నోవేషన్, ఫార్మా, ఏరోస్పేస్ టెక్నాలజీలకు కేంద్రం**

**హైదరాబాద్ బ్రాండ్ ఇమేజీని పెంచేందుకు కలసికట్టుగా కృషి**

**రాష్టాల్ర సహకారంతోనే వికసిత భారత్ కల సాకారం**

**ప్రపంచంలోనే శక్తిమంతమైన దేశంగా భారత్ అవతరణ**

**తెలంగాణ గ్లోబల్ సమ్మిట్‌లో కేంద్రమంత్రి కిషన్ రెడ్డి**




**హైదరాబాద్, (ప్రజాస్వరం):**
హైదరాబాద్ కేవలం ఓ రాష్ట్రానికి రాజధాని నగరం కాదు.. దేశ ఆర్థిక వ్యవస్థకు మూలస్తంభం లాంటిదని కేంద్రమంత్రి కిషన్ రెడ్డి అన్నారు. ఐటీ హబ్‌గా, ..మిగతా 2లో

## తెలంగాణకు రూ.97 వేల కోట్ల
# భారీ పెట్టుబడులు

**సింగపూర్ ఏజీఐడీసీతో రూ.70,000 కోట్లు**

**వియత్నాం విన్‌గ్రూప్‌తో రూ.27,000 కోట్ల ఒప్పందాలు**

**మంత్రులు శ్రీధర్ బాబు, ఉత్తమ్ కుమార్ రెడ్డి**



## రోస్టరింగ్ నిబంధనలు పాటించలేదు

మొదటిపేజీ తరువాయి




మంత్రి ఈ విషయాన్ని వెల్లడించారు. "ఇండిగో నిర్వహణ వైఫల్యమే ప్రస్తుత పరిస్థితులకు ఎదురవ్వడానికి ప్రధాన కారణం. DGCA నిబంధనల ప్రకారం పైలట్లు, క్యాబిన్ క్రూ సిబ్బంది విధి గంటలు, విశ్రాంతి షెడ్యూల్‌ను ఖచ్చితంగా పాటించాలి. కానీ ఇండిగో ఈ రోస్టరింగ్ విధానాన్ని సరిగా అమలు చేయలేదు. ఈ వైఫల్యానికి ఇటీవల అప్‌గ్రేడ్ చేసిన AMSS సాఫ్ట్‌వేర్ ఎటువంటి సంబంధం లేదు" అని మంత్రి అన్నారు.

డిసెంబర్ 1న DGCA అధికారులు ఇండిగో ప్రతినిధులతో ప్రత్యేక సమావేశం నిర్వహించి, కొత్త రోస్టరింగ్ నిబంధనలపై సంపూర్ణ స్పష్టత ఇచ్చామని, అయినా సంస్థ ఎలాంటి సమస్యలను ఆ సమావేశంలో ప్రస్తావించలేదని మంత్రి తెలిపారు. "ప్రయాణికులు ఎదుర్కొంటున్న తీవ్ర ఇబ్బందులపై మాకు తీవ్ర ఆందోళన ఉంది. ఈ విషయాన్ని మేం తేలిగ్గా తీసుకోలేదు. ఇప్పటికే ఉన్నతస్థాయి దర్యాప్తుకు ఆదేశించాం" అని ఆయన పేర్కొన్నారు.

**నలుగురు సభ్యుల దర్యాప్తు కమిటీ**

ఇండిగో సేవల్లో గత వారం రోజులుగా జరుగుతున్న అంతరాయాలకు ఖచ్చితమైన కారణాలను గుర్తించేందుకు పౌర విమానయాన శాఖ నలుగురు సభ్యుల ఉన్నతస్థాయి కమిటీని ఏర్పాటు చేసింది. ఈ కమిటీలో డీజీసీఏ జాయింట్ డైరెక్టర్ జనరల్ శ్రీ సంజయ్ కె బ్రహ్మనే, డెప్యూటీ డైరెక్టర్ జనరల్ శ్రీ అమిత్ గుప్తా , సీనియర్ ఫ్లైట్ ఆపరేషన్స్ ఇన్‌స్పెక్టర్ కెప్టెన్ కపిల్ మాన్‌గ్లిక్, ఫ్లైట్ ఆపరేషన్స్ ఇన్‌స్పెక్టర్ శ్రీ లోకేష్ రాంపాల్ ఉన్నారు. ఈ కమిటీ బాధ్యులను గుర్తించడమే కాకుండా, భవిష్యత్తులో ఇలాంటి అంతరాయాలు ఇతర ఎయిర్‌లైన్స్‌లో కూడా పునరావృతం కాకుండా సిఫార్సులు చేయనుంది.

**"కొత్త ఎయిర్‌లైన్స్‌కు ఇదే సరైన సమయం"**

ఇండిగో సంక్షోభం నేపథ్యంలో భారతీయ విమానయాన మార్కెట్‌లో పోటీని మరింత పెంచే అవకాశం ఉందని మంత్రి అభిప్రాయపడ్డారు. "భారతదేశంలో కొత్త విమానయాన సంస్థలు ప్రారంభం కావడానికి ఇదే మంచి తరుణం. పోటీ సంస్థలు ఏర్పడేలా ప్రోత్సాహకాలు, చర్చలు జరుపుతాం" అని రామ్మోహన్ నాయుడు ప్రకటించారు.

గత ఏడు-ఎనిమిది రోజులుగా ఇండిగో నుంచి దాదాపు 1,200కు పైగా ఫ్లైట్లు రద్దు కాగా, వందలాది ఫ్లైట్లు గంటల తరబడి ఆలస్యమయ్యాయి. ఈ అంతరాయాలతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్న నేపథ్యంలోనే కేంద్రం ఈ చర్యలు చేపట్టింది.

## అది నిరూపిస్తే నేను రాజీనామాకే సిద్ధం!

మొదటిపేజీ తరువాయి




నిరూపిస్తే తాను రాజీనామాకు సిద్ధమని... నిరూపించలేకపోతే రాజీనామాకు సీఎం రేవంత్ రెడ్డి సిద్ధమా? అని సవాల్ విసిరారు. తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడుతూ ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు.

రెండేళ్ల పాలన అనేది ప్రభుత్వ పనితీరుకు గీటురాయిలాంటిదని, కానీ ఈ ప్రభుత్వం నిస్సారంగా, నిరర్థకంగా మిగిలిపోయిందని హరీశ్ రావు దుయ్యబట్టారు. "ఈ రెండేళ్లలో ఆత్మస్తుతి, పరనింద తప్ప కాంగ్రెస్ చేసిందేమీ లేదు. మా ప్రభుత్వం రాగానే మిషన్ భగీరథ, మిషన్ కాకతీయ వంటి పథకాలు తెచ్చాం. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం ప్రారంభించిన ప్రజా దర్బార్ కూడా ఇప్పుడు అమలు కావడం లేదు. కేసీఆర్ తెచ్చిన మెట్రో రైలు, ఫార్మా సిటీ వంటి కీలక ప్రాజెక్టులను రద్దు చేయడం మినహా వీరేమీ చేయలేదు" అని అన్నారు. కాంగ్రెస్ పాలనలో రాష్ట్ర ఆదాయం కూడా పూర్తిగా తగ్గిపోయిందని ఆరోపించారు.

రైతుల సమస్యలపై హరీశ్ రావు తీవ్రంగా స్పందించారు. "మక్కలు కొని 50 రోజులు దాటినా రైతులకు ఇంకా డబ్బులు ఇవ్వలేదు. రైతులకు బేడీలు వేసిన ఈ ప్రభుత్వం రైతు సంక్షోభ ప్రభుత్వం. ఉద్యోగ నోటిఫికేషన్లు ఇవ్వకుండా మద్యం దుకాణాలకు నోటిఫికేషన్లు ఇచ్చి రాష్ట్రాన్ని 'తాగుబోతుల తెలంగాణ'గా మార్చేందుకు రేవంత్ రెడ్డి ప్రయత్నిస్తున్నారు" అని విమర్శించారు. ప్రభుత్వం కాంట్రాక్టర్లకు బిల్లులు అడిగితే విజిలెన్స్, ఏసీబీ దాడులు చేయిస్తోందని ఆరోపించారు.

గ్లోబల్ సమ్మిట్‌ను "గోబెల్స్ సమ్మిట్" అని ఎద్దేవా చేశారు. "గతంలో దావోస్ వెళ్లి డొల్ల కంపెనీలతో ఒప్పందాలు చేసుకుని రేవంత్ నవ్వులపాలయ్యారు. ఇప్పుడు గ్లోబల్ సమ్మిట్ జరుగుతున్న భూమి, ఫార్మా సిటీ కోసం సేకరించిన 13 వేల ఎకరాల భూమి బీఆర్ఎస్ హయాంలో సమీకరించినదే. అందులో రేవంత్ చెమట చుక్క కూడా లేదు" అని అన్నారు. కేసీఆర్ యువత ఉద్యోగాల కోసం ఆలోచిస్తే, రేవంత్ ఆ భూములను తన అనుయాయులకు పంచిపెడుతున్నారని ఆరోపించారు. రెండో ఏడాది పాలన "పెనంలోంచి పొయ్యిలో పడినట్లు ఉంది" అని, మూడో ఏడాది ఏమవుతుందో చూడాలని వ్యాఖ్యానించారు.

## పూలమ్మిండు.. పాలమ్మిండు.. వేల ఎకరాలు కబ్జా పెట్టిండు!

మొదటిపేజీ తరువాయి



పరిశీలించిన కవిత, అనంతరం అంబేద్కర్‌నగర్‌లో బస్తీవాసులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మేడ్చల్‌లో అభివృద్ధి జరిగిందని మల్లారెడ్డి చెబుతున్నా, వాస్తవ పరిస్థితులు దారుణంగా ఉన్నాయన్నారు. తన పర్యటనలో తాగునీరు, రోడ్లు, పాఠశాలలు, ఆసుపత్రులు వంటి కనీస మౌలిక వసతులు కూడా లేవని గుర్తించానని తెలిపారు. నియోజకవర్గంలో సరైన డిగ్రీ, జూనియర్ కళాశాలలు లేకపోవడంతో యువత ఉన్నత చదువులకు దూరమై గంజాయి వంటి వ్యసనాల బారిన పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. జీవో నం.58, 59 కింద భూముల క్రమబద్ధీకరణ పేరుతో పేదల నుంచి డబ్బులు వసూలు చేసి ఏళ్లు గడుస్తున్నా రిజిస్ట్రేషన్లు పూర్తి చేయలేదని కవిత ఆరోపించారు. అదే సమయంలో మాజీ మేయర్, మల్లారెడ్డి కుటుంబ సభ్యుల భూములకు రిజిస్ట్రేషన్ ఎలా జరిగిందని ఆమె ప్రశ్నించారు. ఈ అంశంపై అవసరమైతే సుప్రీంకోర్టు వరకు వెళ్తానని ఆమె స్పష్టం చేశారు. అనంతరం మూడుచింతలపల్లి మున్సిపాలిటీ పరిధిలోని లక్ష్మాపూర్‌లో రైతులతో ముఖాముఖి నిర్వహించి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కాంగ్రెస్ పాలనలో సమస్యలు రెట్టింపయ్యాయని కూడా ఆమె విమర్శించారు.


## తెలంగాణ రైజింగ్ అన్‌స్టాపబుల్..

మొదటిపేజీ తరువాయి

స్పష్టంగా వివరించారు. దేశ భవిష్యత్ కోసం రాజ్యాంగ సభ ఏర్పాటు చేసి భారత రాజ్యాంగ నిర్మాతల దృష్టిని గౌరవించడం చారిత్రక నిర్ణయమని పేర్కొన్నారు. మహాత్మా గాంధీ, డాక్టర్ బీఆర్ అంబేద్కర్ సిద్ధాంతాలే తెలంగాణ అభివృద్ధి మార్గదర్శకాలని ఆయన అన్నారు. విడిపోయిన తర్వాత ప్రజా పోరాటంతో సాధించిన ప్రత్యేక రాష్ట్రం తెలంగాణ 2014లో సోనియా గాంధీ, డాక్టర్ మన్మోహన్ సింగ్ నాయకత్వంలో భారత పటంలో చోటు చేసుకుందని గుర్తు చేశారు. గత దశాబ్దంలో రాష్ట్రం అత్యధిక అభివృద్ధి లక్ష్యాలతో ముందుకు సాగిందన్నారు.

రాష్ట్ర భవిష్యత్ ప్రణాళికల కోసం నిపుణుల కమిటీ ఏర్పాటుతో 'తెలంగాణ రైజింగ్ 2047 విజన్'ను సిద్ధం చేసినట్లు సీఎం వెల్లడించారు. ఈ డాక్యుమెంట్ ప్రజల ఆశలు, ఆకాంక్షలను ప్రతిబింబించేలా రూపొందించబడిందని, ISB, నీతి ఆయోగ్, నిపుణుల సూచనలు ప్రధాన పాత్ర పోషించాయని చెప్పారు. 2034 నాటికి 1 ట్రిలియన్ డాలర్లు, 2047 నాటికి 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తెలంగాణ ఎదగడం ముఖ్య లక్ష్యమని ఆయన స్పష్టం చేశారు. ప్రస్తుతం దేశ జనాభాలో 2.9 శాతమే ఉన్నా.. దేశ GDPలో 5 శాతం వాటా సాధించిన తెలంగాణ 2047 నాటికి దాన్ని 10 శాతానికి పెంచాలనే లక్ష్యంతో ముందుకు సాగుతోంది.

రాష్ట్ర అభివృద్ధి కోసం మొదటిసారి క్యూర్, ప్యూర్, రేర్ అనే మూడు జోన్ల అభివృద్ధి మోడల్‌ను అమలు చేస్తున్నామన్నారు. చైనా గ్వాంగ్‌డాంగ్ మోడల్‌ను ఆదర్శంగా తీసుకొని.. జపాన్, జర్మనీ, దక్షిణ కొరియా, సింగపూర్ వంటి దేశాల పోటీ స్థాయికి తెలంగాణను తీసుకెళ్లే ప్రణాళిక ఉందని ఆయన తెలిపారు. తెలంగాణ



అభివృద్ధి ప్రయాణంలో గ్లోబల్ ఇన్వెస్టర్లు కీలక భాగస్వాములని.. వారికి ఈ సందర్భంగా ఆహ్వానం పలుకుతున్నట్లు సీఎం అన్నారు. "కష్టం అయితే వెంటనే చేయండి.. అసాధ్యమైతే డెడ్‌లైన్ పెంచుతాం" అని సందేశం ఇచ్చారు. "తెలంగాణ రైజింగ్ అన్‌స్టాపబుల్" అంటూ రాష్ట్ర ఎదుగుదలను ప్రతి ఒక్కరూ భాగస్వామ్యం చేయాలని పిలుపునిచ్చారు.

## తెలంగాణ ఆగ్రోస్ భూమిని కాపాడిన హైడ్రా

- **కబ్జాలకు ఆస్కారం లేకుండా కంచె నిర్మాణం**
- **ప్రహరీలు నిర్మించి షెడ్డులు వేసి ఆక్రమణలు**
- **కిరాయిలకు ఇచ్చి రూ. లక్షల్లో వసూలు**

హైదరాబాద్, (ప్రజాస్వరం):

మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా ఉప్పల్ మండలంలోని మౌలాలి నాచారం విలేజ్‌లోని తెలంగాణ ఆగ్రోస్ ఇండస్ట్రీస్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ భూములను హైడ్రా సోమవారం పరిరక్షించింది. సర్వే నెంబరు 29/1 తో పాటు సర్వే నెంబర్ 30 లలో 23.28 ఎకరాలను తెలంగాణ ఆగ్రోస్‌కు రాష్ట్ర ప్రభుత్వం గతంలో కేటాయించింది. అయితే ఈ భూమికి ఆనుకుని ఉన్న దుర్గానగర్, కమలాబాయ్ నగర్, బాబానగర్ కాలనీలవైపు కొంతమేర ఆక్రమణలు జరిగినట్లు హైడ్రా గుర్తించింది. ఇలా ఇప్పటికే 4 ఎకరాలు కబ్జాకు గురైనట్లు నిర్ధారించింది. ఇలా వరుసగా కబ్జాలు జరుగుతున్నాయని, వెంటనే కబ్జాలను తొలగించి ఆగ్రోస్ భూమిని కాపాడాలంటూ తెలంగాణ ఆగ్రోస్ సంస్థ ఛైర్మన్ కాసుల బాలరాజు హైడ్రాకు ఫిర్యాదు చేశారు. హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ ఆదేశాల మేరకు హైడ్రా అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఇప్పటికే ఇళ్లు కట్టుకుని నివాసం ఉన్న వాటిని మినహాయించారు. వాటి జోలికి వెళ్లకుండా ప్రీకాస్ట్ ఇటుకలతో ప్రహరీ నిర్మించి అందులో వేసిన చిన్న షెడ్డులను తొలగించారు. సేకరించిన చెత్తను సెగ్రిగేషన్ చేసేందుకు వినియోగిస్తున్న షెడ్లను , స్క్రాప్ దుకాణాన్ని ఖాళీ చేయించి వాటిని తొలగించినట్లు హైడ్రా వెల్లడించింది.

**ఇప్పటికే పలు కేసులు**

స్థానికంగా లావణ్య అనే మహిళ తప్పుడు పత్రాలతో రెండు ఎకరాలకు పైగా చిన్న ప్లాట్లుగా చేసి అమ్మేయగా, తెలంగాణ ఆగ్రోస్ వారు ఆమెపై నాచారం పోలీసు స్టేషన్ లో కేసులు పెట్టారు. తెలంగాణ ఆగ్రోస్ లోనే పని చేస్తున్న ఉద్యోగి రాజు అనే వ్యక్తితో కలిసి 1200 గజాల ఆక్రమణకు పాల్పడినట్లు ఆ సంస్థల అధికారులు వెల్లడించారు. అలాగే మహేందర్ అనే వ్యక్తి 2 వేల గజాలకు పైగా ఆక్రమమించి ప్లాట్లుగా విడదీసి, ప్రస్తుతానికి చిన్న షెడ్డులు వేసి వాటిని కిరాయికి ఇచ్చినట్టు ఆగ్రోస్ అధికారులు ఫిర్యాదు చేశారు. వీరందరికీ ఇప్పటికే నోటీసులు ఇచ్చామని చెప్పారు. ఇలా వివిధ కట్టడాలతో ఆక్రమణలకు పాల్పడితే, వాటిని తొలగించి తెలంగాణ ఆగ్రోస్ కు చెందిన భూమి చుట్టూ హైడ్రా ఫెన్సింగ్ వేసింది. మల్లాపూర్ డివిజన్‌లో ఎక్కడా కూడా జనం నివసిస్తున్న వాసాల జోలికి వెళ్లలేదని హైడ్రా స్పష్టం చేసింది.




## తెలంగాణకు రూ.97 వేల కోట్ల భారీ పెట్టుబడులు

- **సింగపూర్ ఏజీఐడీసీతో రూ.70,000 కోట్లు**
- **వియత్నాం విన్‌గ్రూప్‌తో రూ.27,000 కోట్ల ఒప్పందాలు**
- **మంత్రులు శ్రీధర్ బాబు, ఉత్తమ్ కుమార్ రెడ్డి**



హైదరాబాద్, (ప్రజాస్వరం):

ఆసియా దేశాలతో ఆర్థిక భాగస్వామ్యంపై నిర్వహించిన గ్లోబల్ సమ్మిట్‌లో తెలంగాణ భారీ విజయం సాధించింది. సింగపూర్‌కు చెందిన ప్రముఖ మౌలిక సదుపాయాల సంస్థ ఏజీఐడీసీ (AGIDC) రాష్ట్రంలో రూ.70,000 కోట్లతో ఏఐ ఆధారిత అత్యాధునిక డేటా సెంటర్లు ఏర్పాటు చేయనుండగా, వియత్నాం దిగ్గజం విన్‌గ్రూప్ రూ.27,000 కోట్లతో సోలార్ విద్యుత్ ప్లాంట్లు, ఎలక్ట్రిక్ వెహికల్స్ (ఈవీ), ఎనర్జీ స్టోరేజీ సిస్టమ్స్, ఇండస్ట్రియల్ టౌన్‌షిప్‌లను నిర్మించనుంది. మొత్తం రూ.97 వేల కోట్లకు చెందిన ఈ రెండు మెగాఒప్పందాలను పరిశ్రమల శాఖ మంత్రి డి. శ్రీధర్‌బాబు, పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి సోమవారం బహిర్గతం చేశారు. సింగపూర్‌లో జరిగిన 'ఆస్టెనబుల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ అండ్ ఇన్వెస్ట్‌మెంట్ సమ్మిట్'లో సింగపూర్, థాయ్‌లాండ్, వియత్నాం దేశాలకు చెందిన ప్రతినిధులతో తెలంగాణ ప్రభుత్వం లోతైన చర్చలు జరిపింది. ఈ సమావేశంలోనే రెండు కీలక ఒప్పందాలు కుదిరాయి.

**రూ.70,000 కోట్ల ఏఐ డేటా సెంటర్లు**

సింగపూర్ ప్రభుత్వ యాజమాన్యంలోని ఏజీఐడీసీ (Asia Green Infrastructure Development Corporation) తెలంగాణలో అతి పెద్ద స్థాయిలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (AI) ఆధారిత గ్రీన్ డేటా సెంటర్లను ఏర్పాటు చేయనుంది. ఈ ప్రాజెక్టు ద్వారా వేలాది ఉద్యోగాలు, అత్యాధునిక టెక్నాలజీ బదిలీ జరుగుతుందని మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి తెలిపారు.

**విన్‌గ్రూప్ – రూ.27,000 కోట్ల గ్రీన్ ఎనర్జీ & ఈవీ ప్రాజెక్టులు**

ప్రపంచంలోనే అతివేగంగా అభివృద్ధి చెందుతున్న వియత్నాం దిగ్గజ సమూహం విన్‌గ్రూప్ (VinGroup) తెలంగాణలో భారీ పెట్టుబడులు పెట్టనుంది. ఈ మొత్తంలో భాగంగా పెద్ద ఎత్తున సోలార్ విద్యుత్ ప్లాంట్లు, ఎలక్ట్రిక్ వాహనాల తయారీ యూనిట్లు, ఎనర్జీ స్టోరేజీ సిస్టమ్స్ (బ్యాటరీ స్టోరేజీ), ఇండస్ట్రియల్ టౌన్‌షిప్‌లు ఏర్పాటు కానున్నాయి. "విన్‌గ్రూప్ రాష్ట్రంలో పూర్తిస్థాయి గ్రీన్ ఎనర్జీ ఎకోసిస్టమ్‌ను నిర్మించనుంది" అని మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి వెల్లడించారు.

టెక్నాలజీ & స్కిల్ డెవలప్‌మెంట్‌పై ప్రత్యేక దృష్టి ఈ రెండు సంస్థలతో జరిగిన చర్చల్లో టెక్నాలజీ బదిలీ, స్కిల్ డెవలప్‌మెంట్, యుద్యోగ అవకాశాల సృష్టి వంటి అంశాలకు ప్రాధాన్యత ఇవ్వడం జరిగిందని మంత్రులు వివరించారు. "మేం కేవలం పెట్టుబడులు మాత్రమే కాకుండా, భవిష్యత్ తరాలకు ఉపయోగపడే టెక్నాలజీ, నైపుణ్యాలను తీసుకొస్తున్నాం" అని ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అన్నారు.

**సీఎం రేవంత్‌రెడ్డి చేతులు మీదుగా ఒలెక్ట్రా ఎలక్ట్రిక్ కారు ఆవిష్కరణ**

ఇదే సందర్భంగా హైదరాబాద్ ఫ్యూచర్ సిటీ ప్రాంగణంలో మరో కార్యక్రమం జరిగింది. ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి స్వయంగా ఒలెక్ట్రా గ్రీన్‌టెక్ లిమిటెడ్ తయారు చేసిన అత్యాధునిక ఎలక్ట్రిక్ ప్యాసింజర్ కారును ఆవిష్కరించారు. ఆయన కొద్ది దూరం ఈ కారును నడిపి పరీక్షించారు. ఈ కారు పూర్తిగా తెలంగాణలోని ఫ్యూచర్ సిటీలోనే అభివృద్ధి చేయబడిన మొదటి ఎలక్ట్రిక్ వాహనమని అధికారులు తెలిపారు. తెలంగాణ ప్రభుత్వం గత ఏడాది కాలంలోనే రూ.2 లక్షల కోట్లకు పైగా పెట్టుబడులను ఆకర్షించిన నేపథ్యంలో ఈ రెండు ఆసియా దిగ్గజాల ఒప్పందాలు మరింత ఊపునిస్తాయని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

## హైదరాబాద్ కేవలం రాజధాని కాదు..



మొదటిపేజీ తరువాయి

ఇన్నొవేషన్ కారిడార్‌గా, ఫార్మాసూటికల్ క్యాపిటల్‌గా, ఏరోస్పేస్ టెక్నాలజీ సెంటర్‌గా వర్ధిల్లుతోంది. ఈ హైదరాబాద్ బ్రాండ్ ఇమేజీని మరింత పెంచేందుకు అందరమూ కలిసి కట్టుగా కృషి చేయాల్సిన అవసరం ఉందని పిలుపునిచ్చారు. 2047 నాటికి మన దేశం వికసిత భారత్‌గా వెలుగొందాలని తరచూ ప్రధాని మోదీ పిలుపునిస్తూ ఉంటారు. అయితే రాష్ట్రాల సహకారంతోనే ఈ కల సాకారమవుతుందని ఆయన అన్నారు. హైదరాబాద్ వేదికగా తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ ఘనంగా మొదలైంది. ఈ కార్యక్రమానికి హాజరైన కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి అనేక విషయాలపై మాట్లాడారు. హైదరాబాద్ నగరం అంటేనే సాంకేతికతతో సంప్రదాయం, శాస్త్ర పరిజ్ఞానంతో ఆధ్యాత్మికత, వారసత్వ సంపదతో సృజనాత్మకత కలగలిసి ఉంటాయని అన్నారు. తెలంగాణ ఏర్పడిన 2014లోనే మార్పు, పారదర్శకత నినాదంతో ప్రధానమంత్రి నరేంద్రమోదీ కేంద్రంలో అధికారంలోకి వచ్చారు. ఆయన అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ప్రపంచంలోనే శక్తిమంతమైన దేశంగా భారత్ అవతరించింది. పేదరిక నిర్మూలన, డిజిటల్ సాధికారత, వడివడిగా మౌలికవసతుల కల్పన, రైతుల సంక్షేమం, స్టార్టప్స్‌కు ప్రోత్సాహం ఇలా అన్ని రంగాల్లో ముమ్ముందుకు సాగిపోతోందన్నారు. పరిశ్రమలను, స్టార్టప్స్‌ను, టాలెంట్ ను, అంతర్జాతీయ పెట్టుబడులను ఆకర్షించే విషయంలో రాష్ట్రాలు పోటీ పడాలి. రాష్ట్రాల మధ్య సుహృద్భావ పోటీతోనే ప్రమాణాలు పెరగడంతో పాటు సంస్కరణలకు వీలు కలుగుతుందని.. తద్వారా ప్రజలకు మెరుగైన సేవలు అందించే అవకాశం ఉంటుందని ఈ సందర్భంగా ఆయన తెలియచేశారు. 2014 నుంచి 25 వరకు 748.78 బిలియన్ డాలర్ల విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు వచ్చాయి. అంతకుముందు దశాబ్దంతో పోలిస్తే ఏకంగా 143 శాతం వృద్ధి నమోదు కావడం విశేషం. మోదీ ప్రభుత్వం తీసుకొచ్చిన సంస్కరణలతో వ్యవస్థలో పారదర్శకత, జవాబుదారీతనం, అవినీతి రహిత పాలన పెరిగింది. దీంతో పెట్టబడిదారుల్లో నమ్మకం పెరిగింది. భారత్‌ను పెట్టుబడులకు సురక్షితమైన దేశంగా అంతర్జాతీయ పెట్టుబడిదారులు భావిస్తున్నారు. 'ఆత్మ నిర్భర్ భారత్', 'మేకిన్ ఇండియా' ద్వారా భారత్ మొబైల్ ఫోన్ల తయారీ రంగంలో ప్రపంచంలోనే రెండో అతిపెద్ద దేశంగా అవతరించింది. 2014లో రెండు యూనిట్లు ఉండగా.. ఇప్పుడు ఆ సంఖ్య ఏకంగా 300 యూనిట్లకు పెరిగింది. రక్షణ రంగం ఎగుమతులు 2013`14లో రూ.686 కోట్లు ఉండగా, ఇప్పుడు 34 రెట్లు పెరిగి ఏకంగా రూ.23,622 కోట్లకు ఎగబాకాయి. ఆపరేషనల్ ఎయిర్ పోర్టులు 2014లో 74 ఉండగా, ఇప్పుడు అది రెట్టింపై 160కి పెరిగాయి. రైల్వే క్యాపిటల్ పెట్టుబడులు, మెట్రో నెట్ వర్క్ భారీగా పెరిగాయి. గత పదేళ్లలో దేశంలో 25 కోట్ల మంది పేదరికం నుంచి బయటపడ్డారు. ద్రవ్యోల్బణం నియంత్రణలో ఉంది. గ్లోబల్ నార్త్, గ్లోబల్ సౌత్‌కు మధ్య వారధిగా, పెద్దన్న పాత్ర పోషిస్తోందని వివరించారు. 2014 నుంచి కేంద్ర ప్రభుత్వం తెలంగాణ అభివృద్ధికి పన్నుల, గ్రాంట్లు, కేంద్ర ప్రాయోజిక పథకాలు, కేంద్ర ప్రభుత్వ పథకాల రూపంలో రూ.10 లక్షల కోట్లకు పైగా నిధులను అందించింది. తెలంగాణలో జాతీయ రహదారుల అభివృద్ధికి రూ.1.5 లక్షల కోట్లు కేటాయించి, కారిడార్లు, రహదారుల విస్తరణ, నూతన జాతీయ రహదారులు, ఎకనామిక్ కారిడార్లను కేంద్ర ప్రభుత్వం నిర్మించిందన్నారు. రైల్వే కొత్త లైన్లు, డబ్లింగ్, ట్రిప్లింగ్ పనులు, ఎలక్ట్రిఫికేషన్, సిగ్నలింగ్ వంటి పనుల కోసం రూ.32 వేల కోట్లు కేటాయించింది. అమృత్ భారత్ స్టేషన్ పథకం కింద తెలంగాణలో రూ.2,500 కోట్లతో 42 రైల్వే స్టేషన్లను అభివృద్ధి చేస్తోంది. రూ.521 కోట్లతో కాజీపేటలో రైల్వే మానుఫ్యాక్చరింగ్ యూనిట్ తొలి దశ నిర్మాణ పనులు దాదాపు పూర్తయ్యాయి. రామగుండంలో రూ.11 వేల కోట్లతో ఎన్టీపీసీ ఆధ్వర్యంలో 1600 మెగావాట్ల కొత్త థర్మల్ పవర్ ఎలాంటు నిర్మించాం. మరో 2400 మెగావాట్ల థర్మల్ విద్యుత్ ఎలాంట్లు నిర్మించేందుకు ఎన్టీపీసీ సిద్ధంగా ఉందని ఆయన చెప్పుకొచ్చారు. వరంగల్ లో పీఎం మిత్ర టెక్స్‌టైల్ పార్కు ద్వారా లక్ష మందికి ఉపాధి అవకాశాలు వస్తాయి. రూ.2300 కోట్లతో జహీరాబాద్ ఇండస్ట్రియల్ కారిడార్ ను అభివృద్ధి చేస్తున్నాం. ఎయిమ్స్ బీబీనగర్, ఐఐటీ హైదరాబాద్, డీఆర్ డీవో, హెచ్ఏఎల్, బీడీఎల్, మిదాని వంటి ప్రతిష్టాత్మకమైన సంస్థలు హైదరాబాద్‌లో ఉన్నాయి. ఇవన్నీ కూడా తెలంగాణను దేశ ఆర్థిక వ్యవస్థ అభివృద్ధిలో భాగస్వామ్యం చేయడంలో కీలక పాత్ర పోషిస్తాయన్నారు. ప్రస్తుతం దేశంలోనే నాలుగో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా తెలంగాణ ఉంది. త్వరలోనే మూడో స్థానానికి ఎగబాకుతుందనడంలో సందేహం లేదన్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నేతృత్వంలో తెలంగాణ అభివృద్ధి కోసం తెలంగాణ ప్రభుత్వంతో కలిసి పనిచేసేందుకు ఎప్పుడూ సిద్ధంగానే ఉంటుంది. ఈ సదస్సు ద్వారా తెలంగాణకు ముఖ్యంగా హైదరాబాద్ కు మరిన్ని పెట్టుబడులు వస్తాయని ఆశిస్తున్నానని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి ఆశాభావం వ్యక్తం చేశారు.

# బెంగళూరుతో హైదరాబాద్ పోటీ

**మొదటిపేజీ తరువాయి**



ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు.
"బెంగళూరుతో హైదరాబాద్ పోటీ పడుతోందని నేను చాలా సంతోషిస్తున్నాను. ఈ పోటీ ఆరోగ్యకరమైనది, దేశానికి మేలు చేసేది. ఈ రెండు నగరాలూ ఇప్పుడు సిలికాన్ వ్యాలీ, షాంఘై, సింగపూర్ వంటి ప్రపంచ నగరాలతో పోటీ పడుతున్నాయి" అని డీకే శివకుమార్ అన్నారు.
తెలంగాణ ప్రభుత్వం రాష్ట్ర భవిష్యత్తును దృష్టిలో పెట్టుకొని, తర్వాతి తరానికి ఏం కావాలో ముందుగానే ఆలోచించి ప్లాన్ చేసిందని ఆయన ప్రశంసించారు. "దక్షిణ భారతదేశం అభివృద్ధికి కర్ణాటక పూర్తి స్థాయిలో సహకరిస్తుంది. తెలంగాణతో కలిసి ముందుకు సాగడానికి మేము సిద్ధంగా ఉన్నాం" అని ఆయన హామీ ఇచ్చారు.
భారత ఐటీ రంగంలో బెంగళూరు, హైదరాబాద్ పాత్రను గుర్తు చేస్తూ డీకే శివకుమార్ ఆసక్తికర గణాంకాలు పేర్కొన్నారు. "దేశ ఐటీ ఎగుమతుల్లో బెంగళూరు ఒక్కటే 40 శాతం వాటా కలిగి ఉంది. చిన్న రాష్ట్రమైనప్పటికీ తెలంగాణ కూడా గణనీయమైన వాటాన్ని సాధించింది. అమెరికాలోని కాలిఫోర్నియా వంటి ప్రాంతాల్లో 13 లక్షల మంది భారతీయ ఇంజినీర్లు పని చేస్తున్నారు. వీరిలో ఎక్కువ మంది బెంగళూరు, హైదరాబాద్ నుంచి వెళ్లిన వారే" అని ఆయన తెలిపారు.
తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఐటీ & ఇండస్ట్రీస్ మంత్రి శ్రీధర్ బాబు, ఇతర ఉన్నతాధికారులు ఈ సదస్సులో పాల్గొన్నారు. రెండు రాష్ట్రాల మధ్య సాంకేతికత, పరిశ్రమల రంగంలో సహకారం పెరుగుతుందన్న ఆశలు ఈ సమ్మిట్ ద్వారా మరింత బలపడ్డాయి.

# మాచనపల్లిలో ఉద్రిక్తత సర్పంచ్ అభ్యర్థి తండ్రిపై పాశవిక దాడి.

- **పొలం వద్ద ఒంటరిగా ఉన్న రిటైర్డ్ హెచ్ఎంపై దాడికి తెగబడ్డ దుండగుడు.**
- **చెవులు కొరుకుతూ.. గొడ్డలితో హల్చల్.**
- **పోలీసుల రాకతో పరారీ.. కేసు నమోదు చేసిన ఎస్సై శ్రీశైలం.**





**బొమ్మలరామారం, డిసెంబర్ 08(ప్రజాస్వరం):**
యాదాద్రి భువనగిరి జిల్లా బొమ్మలరామారం మండలం మాచనపల్లి గ్రామంలో స్థానిక సంస్థల ఎన్నికల వేళ ఉద్రిక్తత చోటుచేసుకుంది. అధికార పార్టీ బలపరిచిన సర్పంచ్ అభ్యర్థి తండ్రిపై, అదే గ్రామానికి చెందిన ఓ వ్యక్తి పాశవికంగా దాడి చేసిన ఘటన ఆదివారం జరిగింది. వివరాల్లోకి వెళితే.. మాచనపల్లి గ్రామానికి చెందిన రిటైర్డ్ హెడ్ మాస్టర్ దాసరి శ్రీనివాస్ రెడ్డి కుమారుడు దాసరి సూర్య ప్రకాష్ రెడ్డి, జనరల్ స్థానంలో అధికార పార్టీ తరఫున సర్పంచ్ అభ్యర్థిగా పోటీ చేస్తున్నారు. ఆదివారం సూర్య ప్రకాష్ రెడ్డి ఎన్నికల ప్రచారంలో భాగంగా హైదరాబాద్‌లో ఉన్న ఓటర్లను కలవడానికి వెళ్లారు. ఇదే అదునుగా భావించిన అదే గ్రామానికి చెందిన దాసరి కృష్ణారెడ్డి (అలియాస్ చిన్నోల్ల కృష్ణారెడ్డి) పొలం వద్ద ఒంటరిగా ఉన్న సర్పంచ్ అభ్యర్థి తండ్రి దాసరి శ్రీనివాస్ రెడ్డిపై దాడికి దిగాడు. గొడ్డలితో బీభత్సం శ్రీనివాస్ రెడ్డిపై విచక్షణా రహితంగా దాడి చేసిన కృష్ణారెడ్డి, ఆయనను గోళ్లతో రక్కుతూ, చెవులను కొరుకుతూ పైశాచికానందం పొందాడు. అంతటితో ఆగకుండా, అక్కడే చెట్లు నరుకుతున్న కూలీల వద్ద ఉన్న గొడ్డలిని లాక్కొని చంపేస్తానని బెదిరిస్తూ బీభత్సం సృష్టించాడు. దీంతో శ్రీనివాస్ రెడ్డితో పాటు అక్కడి వారు భయభ్రాంతులకు గురయ్యారు.

**పోలీసులను చూసి పరారీ**
ఎన్నికల బందోబస్తులో భాగంగా స్థానిక ఎస్సై బుగ్గ శ్రీశైలం ఆ సమయంలో పెట్రోలింగ్ నిర్వహిస్తున్నారు. విషయం తెలుసుకున్న ఎస్సై ఘటనా స్థలానికి చేరుకుంటుండగా, గమనించిన నిందితుడు కృష్ణారెడ్డి అక్కడి నుండి పరారయ్యాడు.

**పాత నేరస్తుడే.**
నిందితుడు కృష్ణారెడ్డి గతంలోనూ గ్రామానికి చెందిన ఇద్దరు వ్యక్తులపై ఇదే రీతిలో దాడులకు పాల్పడినట్లు, అతడిపై పలు కేసులు ఉన్నట్లు గ్రామస్తులు తెలిపారు. ఎన్నికల సమయంలో ఇలాంటి వ్యక్తులు దాడులకు పాల్పడితే ఓటర్లు భయపడే ప్రమాదం ఉందని, నిందితుడిపై కఠిన చర్యలు తీసుకోవాలని గ్రామ ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. కేసు నమోదు బాధితుడి ఫిర్యాదు మేరకు ఘటనా స్థలాన్ని పరిశీలించిన ఎస్సై బుగ్గ శ్రీశైలం, దాసరి కృష్ణారెడ్డిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వెల్లడించారు.

# వందేమాతరంపై చర్చ ఎందుకు ?

- **ఎన్నికల హడావుడిలో దేశ ప్రయోజనాలు మరచారా?**
- **వందేమాతరం రాజకీయీకరణ పై ప్రియాంక ఆగ్రహం**
- **మేము దేశం కోసం పోరాడతామంటున్న ప్రియాంక గాంధీ**
- **పార్లమెంట్ సభలో బీజేపీ**



**న్యూఢిల్లీ, (ప్రజాస్వరం):**
లోక్‌సభలో వందేమాతరం గేయం పై జరిగిన చర్చ సందర్భంగా కాంగ్రెస్ ఎంపీ ప్రియాంక గాంధీ వాద్రా, కేంద్ర ప్రభుత్వం, బీజేపీ పై తీవ్రంగా విమర్శలు గుప్పించారు. దేశ ప్రయోజనాల కంటే ఎన్నికల లాభానికే బీజేపీ ప్రాధాన్యం ఇస్తోందని ఆమె ఆరోపించారు. సభలో వరుసగా జరుగుతున్న అంతరాయాలు, గందరగోళం పాలకపక్షం ఎన్నికల వ్యూహాల్లో భాగమని ప్రియాంక మండిపడ్డారు. మీరు ఇక్కడ ఎన్నికల కోసం కూర్చున్నారు... కానీ మేము దేశ ప్రయోజనాల కోసం పోరాడేందుకు వచ్చాం. ఎన్నికల్లో మేము ఓడినా, మా స్వరం పార్లమెంట్‌లో మౌనమవదు. ప్రజల కోసం, దేశ విలువల కోసం ఇక్కడే నిలుస్తాం, పోరాడుతూనే ఉంటాం అని ఆమె స్పష్టం చేశారు.
2025 శీతాకాల సమావేశాల్లో వందేమాతరం గేయాన్ని చర్చ విషయంగా తీసుకురావడంలో అసలు అవసరం ఏమిటని ప్రశ్నించిన ప్రియాంక, ఈ చర్చ ప్రజలు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యల నుండి దృష్టి మళ్లించే ప్రయత్నమేనని ఆరోపించారు. వందేమాతరాన్ని రాజకీయ స్వార్థాలకు వాడటం సముచితం కాదని ఆమె తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. ప్రత్యేకంగా పశ్చిమ బెంగాల్ ఎన్నికలు దగ్గరపడుతున్న నేపథ్యంలోనే ఈ అంశాన్ని లేవనెత్తారని ఆమె ఆరోపించారు. ఎన్నికల వాతావరణాన్ని రెచ్చగొట్టేందుకు ప్రభుత్వం ఈ చర్చను ముందుకు తెస్తోందని ప్రియాంక విమర్శించారు. వందేమాతరం గేయం ధైర్యం, త్యాగం, జాతీయ అంకిత భావానికి ప్రతీక అని గుర్తుచేస్తూ ఈ గేయం మన అంతరాత్మలో మిళితమై ఉంది. ఇది మన స్వాభిమానానికి, మన జాతీయతకు ప్రతిబింబం అని ప్రియాంక అన్నారు.

# తండాలను పంచాయతీలుగా చేసిన ఘనత కేసీఆర్ దే : ఆర్జేసి కృష్ణ

**ఖమ్మం డిసెంబర్ 08(ప్రజాస్వరం):**
తండాలను గ్రామ పంచాయతీ లు గా చేసిన ఘనత కేసీఆర్ దే నని, రానున్న గ్రామ పంచాయతీ ఎన్నికల్లో బిఆర్ఎస్ బలపర్చిన అభ్యర్థులను అత్యధిక మెజార్టీలిపించి గ్రామాల అభివృద్ధి కి సహకరించాలని బిఆర్ఎస్ సీనియర్ నాయకులు గుండాల కృష్ణ కోరారు. రఘునాథ పాలెం మండల పరిధి లోని బద్యా తండా, పరికలబోడు తండా, ఈర్లపుడి, పంగిడి, కెవి బంజర తదితర గ్రామాల్లో పార్టీ మద్దతుతో సర్పంచ్ అభ్యర్థులుగా పోటీ చేస్తున్న పెంట్యా, బద్రు, అనసుర్య, సోలీ, సరిత ల విజయాన్ని కాంక్షిస్తూ పార్టీ మండల అధ్యక్షులు వీరూ నాయక్ తో కలిసి విస్తృత ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో కృష్ణ మట్లాడుతూ గ్రామాలలో బిఆర్ఎస్ హయాంలో రాష్ట్ర మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ నాయకత్వంలో జరిగిన అభివృద్ధి తప్ప కొత్తగా ఏమి జరగలేదన్నారు. ఆనాడు గ్రామాల్లో సీసీ రోడ్లు, మిషన్ భగీరథ ద్వారా మంచినీరు, పల్లె ప్రకృతి, రైతు వేదుకలు, స్మశాన వాటికలు తో పాటు కోట్లాది రూపాయలు వెచ్చించి ఇతర అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టారని గుర్తు చేశారు. మండలంలోని గ్రామాలు మరింత అభివృద్ధి చెందేందుకు బిఆర్ఎస్ మద్దతు ప్రకటించిన సర్పంచ్ అభ్యర్థులను గెలిపించాలని సూచించారు. అనంతరం ఈర్లపూడి గ్రామంలో మాజీ ఎం.ఎల్. ఏ.మదన్ లాల్ వదిన బానోత్ కళావతి ని కలిసి ఎన్నికల పై చర్చించారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు రవి, మనోహర్ రెడ్డి రవిప్రకాష్, జాన, సంజీవరావు, చిన, రవి, రాజా, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.



# ఎన్నికల ఉల్లంఘన లక్ష రూపాయల నగదు పోలీసులు పట్టివేత

**కరీంనగర్, డిసెంబర్ 08(ప్రజాస్వరం):**
ఎన్నికల కోడ్ అమల్లో ఉన్న నేపథ్యంలో పోలీసులు చెక్కుచెదరని తనిఖీలు నిర్వహిస్తున్నారు. నగునూరు-జూబ్లీ నగర్ మార్గంలో శనివారం మధ్యాహ్నం రూటీన్ చెకింగ్ చేస్తుండగా పెద్ద మొత్తంలో నగదు పట్టుబడింది. వివరాల్లోకి వెళ్తే... రేకుర్తి గ్రామానికి చెందిన వేముల శ్రీకాంత్ (28), వడ్డెర ని పోలీసులు ఆపి తనిఖీ చేశారు. అతడి వద్ద ఒక లక్ష రూపాయల నగదు ఉండగా, ఆ మొత్తానికి సంబంధిత ఎటువంటి అనుమతులు, ఆధారాలు చూపలేకపోయినట్టు ఇన్స్పెక్టర్ ఏ.నిరంజన్ రెడ్డి తెలిపారు. ఎన్నికల నియమావళి ప్రకారం అనుమతి లేని నగదు వెంట తీసుకెళ్తున్నందున ఆ మొత్తాన్ని స్వాధీన పరచి, వ్యక్తిని స్టేషన్‌కు తరలించినట్టు తెలిపారు. నగదు మూలం నిరూపించే ఆధారాలు సమర్పించాలని శ్రీకాంత్‌కు నోటీసులు ఇస్తూ, స్వాధీనం చేసిన నగదును మండల తహసీల్దార్, రిటర్నింగ్ అధికారికి తదుపరి చర్యల కోసం పంపించినట్టు ఇన్స్పెక్టర్ పేర్కొన్నాడు.



# పాము కాటుతో గృహిణి దుర్మరణం

**చర్లపల్లి, డిసెంబర్ 08(ప్రజాస్వరం):**
కాప్రా మున్సిపల్ పరిధిలోని చర్లపల్లి డివిజన్ పరిధిలో విషాదకర ఘటన వెలుగులోకి వచ్చింది. స్థానిక బీఎన్ రెడ్డి నగర్‌కు చెందిన గృహిణి జ్యోతి నర్సమ్మ (81) పాము కాటుకు గురై మృతిచెందిన విషయం ఆలస్యంగా బయటపడింది. ఫిర్యాదుదారు జ్యోతి మల్లేశ్ (67) వివరాల ప్రకారం——ఈ నెల 2వ తేదీ మధ్యాహ్నం 1:10 గంటల సమయంలో నర్సమ్మ ఇంటి ప్రాంగణంలో చెట్టు కింద ఉన్న మంచంపై విశ్రాంతి తీసుకుంటుండగా అనూహ్యంగా కిందపడిపోయారు. ఈ దృశ్యాన్ని గమనించిన పొరుగువారు వెంటనే ఆమె కుమారుడికి ఫోన్ ద్వారా సమాచారం అందించారు. ఇంటికి చేరుకున్న మల్లేశ్‌కు నర్సమ్మను పాము కాటేసినట్లు గుర్తించారు. వెంటనే ఆమెను నాచారం ప్రసాద్ హాస్పిటల్‌కు తరలించగా, అక్కడి వైద్యులు పరిస్థితి విషమంగా ఉండటంతో గాంధీ ఆస్పత్రికి రిఫర్ చేశారు. అక్కడ చికిత్స పొందుతున్న నర్సమ్మ డిసెంబర్ 7 ఉదయం 11:35 గంటలకు మరణించినట్లు డ్యూటీ డాక్టర్ వెల్లడించారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

# గుండెపోటుతో వార్డు మెంబర్ అభ్యర్థి మృతి

**శంకర్ పల్లి, డిసెంబర్ 08(ప్రజాస్వరం)**



గుండెపోటుతో మహిళా వార్డు మెంబర్ మృతి చెందిన సంఘటన శంకర్ పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో ఆదివారం అర్ధరాత్రి చోటుచేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. శంకర్ పల్లి మండలం మాసానిగూడ గ్రామానికి అనుబంధ గ్రామమైన మంచర్లగూడ గ్రామానికి చెందిన పల్లె లతా నర్సింలు స్థానిక సంస్థల ఎన్నికలలో ఎనిమిదో వార్డు నుంచి వార్డ్ మెంబర్ గా పోటీలో ఉన్నారు. కాగా ఆదివారం రాత్రి అకస్మాత్తుగా గుండెపోటు రావడంతో మృతి చెందింది. మృతురాలికి ఇద్దరు బిడ్డలు ఒక కుమారుడు ఉన్నారు. వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు.

# శ్రీ బ్రహ్మసూత్ర మరకత లింగాన్ని దర్శించుకున్న టాలీవుడ్ డైరెక్టర్ వెంకటేష్ రెబ్బ

**శంకర్‌పల్లి డిసెంబర్ 08(ప్రజాస్వరం):**



శంకర్‌పల్లి మండల పరిధిలోని చందిప్ప గ్రామ శివారులో గల 11 వ శతాబ్దానికి చెందిన మహిమగల శ్రీ బ్రహ్మసూత్ర మరకత శివాలయంలో సోమవారం టాలీవుడ్ డైరెక్టర్ వెంకటేష్ రెబ్బ దంపతులు స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకం చేశారు. ఆలయ చైర్మన్ గోపాల్ రెడ్డి, అర్చకులు ప్రమోద్, డైరెక్టర్ ను స్వామివారి శేష వస్త్రంతో సత్కరించి, స్వామి వారి చిత్రపటాన్ని బహుకరించారు. మహిమగల లింగాన్ని దర్శించుకోవడం ఎంతో సంతృప్తినిచ్చిందని డైరెక్టర్ అన్నారు. ప్రస్తుతం శ్రీకాంత్ హీరోగా నటిస్తున్న మరణమృదంగం సినిమా చిత్రీకరణ జరుగుతుందని పేర్కొన్నారు. మరల సమయం చూసుకొని శివాలయానికి వస్తానని తెలియజేశారు.

# మందలపల్లి 11వ వార్డులో సునీల్‌కుమార్ జోరుగా ప్రచారం

**అశ్వారావుపేట, (ప్రజాస్వరం):**
అశ్వరావుపేట నియోజకవర్గం దమ్మపేట మండలం మందలపల్లి గ్రామపంచాయతీ 11వ వార్డులో ఎన్నికల ప్రచారం దూకుడు పెరుగుతోంది. ఈ వార్డులో స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేస్తున్న యువ నాయకుడు సునీల్‌కుమార్ ఇంటింటికీ తిరిగి ప్రజల మద్దతు కోరుతున్నారు. స్థానికుల సమస్యలను పరిష్కరించేందుకు ఎప్పుడూ ముందుండే వాడినని, తనపై ప్రజలు విశ్వాసం ఉంచి గెలిపిస్తే వార్డుకు అభివృద్ధి తెచ్చేందుకు పాటుపడతానని సునీల్‌కుమార్ వెల్లడించారు. "స్టూల్ గుర్తుకు మీ అమూల్యమైన ఓటు వేయండి" అని ఆయన ప్రజలకు మనవి చేశారు.



# మందలపల్లి 8వ వార్డులో మాణికుల సుబ్బారావు కాంగ్రెస్ అభ్యర్థి జోరుగా ప్రచారం

**అశ్వారావుపేట, డిసెంబర్ 08(ప్రజాస్వరం):**
అశ్వరావుపేట నియోజకవర్గం దమ్మపేట మండలం మందలపల్లి గ్రామపంచాయతీ 8వ వార్డులో ఎన్నికల ప్రచారం దూకుడు పెరుగుతోంది. ఈ వార్డులో కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేస్తున్న యువ నాయకుడు మాణికుల సుబ్బారావు ఇంటింటికీ తిరిగి ప్రజల మద్దతు కోరుతున్నారు. స్థానికుల సమస్యలను పరిష్కరించేందుకు ఎప్పుడూ ముందుండే వాడినని, తనపై ప్రజలు విశ్వాసం ఉంచి గెలిపిస్తే వార్డుకు అభివృద్ధి తెచ్చేందుకు పాటుపడతానని మాణికల సుబ్బారావు వెల్లడించారు. "గ్యాస్ బండ గుర్తుకు మీ అమూల్యమైన ఓటు వేయండి" అని ఆయన ప్రజలకు మనవి చేశారు.





## జవహర్ నగర్ కాంగ్రెస్ పార్టీ సేవాదళ్ అధ్యక్షుడిగా కాసోజు యాకా చారి

**జవహర్ నగర్, డిసెంబర్ 8, ప్రజాస్వరం:**

తనపై నమ్మకంతో పార్టీ ఇచ్చిన బాధ్యతను సక్రమంగా నిర్వహిస్తానని జవహర్ నగర్ కాంగ్రెస్ సేవాదళ్ అధ్యక్షుడు కాసోజు యాక చారి అన్నారు. సోమవారం మేడ్చల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు తోటకూర వజ్రేష్ యాదవ్ను ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ సందర్భంగా కాసోజు యాక చారి మాట్లాడుతూ...తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ సేవాదళ్ అధ్యక్షుడు మిద్దెల జితేందర్, మేడ్చల్ జిల్లా కాంగ్రెస్ సేవాదళ్ షఫీ జవహర్ నగర్ కాంగ్రెస్ సేవాదళ్ తనకు అవకాశం ఇచ్చినందుకు ధన్యవాదాలు తెలిపారు.ఈ కార్యక్రమంలో జవహర్ నగర్ మాజీ సర్పంచ్ కారింగుల శంకర్ గౌడ్, జవహర్ నగర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మల్లెపూల శ్రీకాంత్ యాదవ్, నాయకులు అశోక్ గుప్తా,రాగుల ఐలయ్య,బాచుపల్లి దయాకర్ చారి, అనిల్,బూడిద వెంకటేష్ భాస్కర్ గౌడ్,లక్ష్మణ్,కాసోజు రమేష్ చారి, గుడిపల్లి సోమయ్య చారి, మల్లేష్ తదితరులు.



## అయ్యప్ప ఆలయానికి సిసి రోడ్ నిర్మించండి: డిప్యూటీ కమిషనర్ వసంతకు అయ్యప్ప స్వాముల వినతి

**జవహర్ నగర్, డిసెంబర్ 8, ప్రజాస్వరం:**

జవహర్ నగర్ సర్కిల్ పరిధిలోని బాలాజీ నగర్ శ్రీ అయ్యప్ప స్వామి ఆలయానికి వెళ్లే రోడ్డును సీసీ రోడ్డు నిర్మించాలని సోమవారం అయ్యప్ప స్వామి మాలదారులు సర్కిల్ డిప్యూటీ కమిషనర్ వసంతను కలిసి వినతి పత్రం అందజేశారు. ఆలయానికి వెళ్లే రోడ్డు సరిగా లేకపోవడంతో భక్తులు ఇబ్బంది పడుతున్నారని వెంటనే 320 మీటర్ల రోడ్డు ఏర్పాటు చేసేందుకు చర్యలు చేపట్టాలని వారు కోరారు.కార్యక్రమంలో అయ్యప్ప స్వామి మాలదారులు ,భక్తులు తదితరులు పాల్గొన్నారు.




## అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం

- **దౌల్తాబాద్‌లో అవగాహన సదస్సు**

**దౌల్తాబాద్, డిసెంబర్8( ప్రజాస్వరం ):**

అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం సందర్భంగా జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల, దౌల్తాబాద్‌లో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మండల విద్యాధికారి గజ్జల కనకరాజు అధ్యక్షత వహించారు. సదస్సును ఉద్దేశించి మాట్లాడిన మండల విద్యాధికారి గజ్జల కనకరాజు మాట్లాడుతూ దివ్యాంగుల సామర్థ్యాలను గుర్తించి వారికి సమాన అవకాశాలు కల్పించడం మనందరి బాధ్యత. వారి సమస్యలను పరిష్కరించడానికి సమాజం దృక్పథాన్ని మార్చుకోవాలి. దివ్యాంగులు కూడా సమాజ అభివృద్ధిలో కీలక పాత్ర పోషించే సామర్థ్యం కలవారే" అని అన్నారు. ఈ సందర్భంగా పాఠశాల దివ్యాంగ విద్యార్థులకు ఆటల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల ఇన్‌చార్జ్ ప్రధానోపాధ్యాయురాలు వెంకటలక్ష్మి, స్పెషల్ ఎడ్యుకేటర్ గుర్రాల రమేష్, పాఠశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.









## మీ మొబైల్ పోయిందా? ఆందోళన చెందవద్దు!

- **110 మొబైల్ ఫోన్ల రికవరీ, బాధితులకు అందజేత..**
- **జిల్లా ఎస్పీ డి. వి. శ్రీనివాస రావు....**

**మెదక్ డిసెంబర్ 08 (ప్రజాస్వరం)**

మెదక్ జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో జిల్లా ఎస్పీ డి. వి. శ్రీనివాస రావు ఐపీఎస్ గారు మాట్లాడుతూ ప్రస్తుతం ప్రతి ఒక్కరి జీవితంలో మొబైల్ ఫోన్ కీలకపాత్ర పోషిస్తోందని, అందులో వ్యక్తిగత సమాచారం, బ్యాంకు వివరాలు, సోషల్ మీడియా అకౌంట్లు, ఫోటోలు, కాంటాక్ట్స్ వంటి ముఖ్యమైన డేటా ఉంటుందని గుర్తు చేశారు. ఫోన్ పోయినప్పుడు లేదా చోరీకి గురైనప్పుడు ప్రజలు ఆందోళన చెందకుండా సంబంధిత పోలీస్ స్టేషన్లో పిర్యాదు చేసి, సీఈఐఆర్ పోర్టల్ లో వివరాలను నమోదు చేయాలని సూచించారు. ఇటీవల మెదక్ జిల్లాలో పోగొట్టుకున్న 110 మొబైల్ ఫోన్ల ను రికవరీ చేసి బాధితులకు అందజేశారు. ఈ సంవత్సరం ఇప్పటి వరకు మొత్తం 1,734 మొబైల్ ఫోన్లను తిరిగి స్వాధీనం చేసుకొని బాధితులకు అందించామని తెలిపారు. తమ కోల్పోయిన ఫోన్లు తిరిగి రావడంతో బాధితులు ఆనందం వ్యక్తం చేస్తూ జిల్లా పోలీస్ శాఖ కు ధన్యవాదాలు తెలిపారు. సీఈఐఆర్ పోర్టల్ సాయంతో పోయిన ఫోన్లను గుర్తించడం చాలా సులభమని, ప్రతి ఒక్కరు దీనిని వినియోగించుకోవాలని ఎస్పీ పేర్కొన్నారు. ప్రతి పోలీస్ స్టేషన్లో సీఈఐఆర్ కోసం ప్రత్యేకంగా అధికారులను నియమించి శిక్షణ ఇచ్చినట్లు తెలిపారు. ఫోన్ పోయిన సందర్భంలో నిర్లక్ష్యం చేస్తే వ్యక్తిగత సమాచారం దుర్వినియోగానికి గురయ్యే ప్రమాదం ఉందని హెచ్చరించారు. దొంగిలించిన ఫోన్లు నేరాలకు ఉపయోగించే అవకాశం ఉన్నందున సీఈఐఆర్ లో నమోదు చేయడం తప్పనిసరని తెలిపారు. సెకండ్ హ్యాండ్




ఫోన్లు కొనే ముందు అవి చోరీకి గురైయినవో కాదో తప్పనిసరిగా చెక్ చేయాలని సూచించారు. ఎవరికైనా మొబైల్ ఫోన్ దొరికితే సంబంధిత పోలీస్ స్టేషన్లో అప్పగించాలని విజ్ఞప్తి చేశారు. వీక్ పాస్‌వర్డ్ల వలన ఫోన్లు సులభంగా అన్ లాక్ అయ్యి బ్యాంకింగ్ యాప్‌లు, యూపీఐ, వాట్సాప్ వంటి యాప్‌లలోని డేటా దుర్వినియోగం అయ్యే అవకాశం ఉందన్నారు.మొబైల్ పోయిన వెంటనే సంబంధిత బ్యాంకు అధికారులకు తెలియజేసి యూపీఐ లావాదేవీలను బ్లాక్ చేయించుకోవడం అత్యంత ముఖ్యమని సూచించారు. ఈ కార్యక్రమంలో మొబైల్స్ రికవరీలో సాంకేతిక నైపుణ్యం ప్రదర్శించిన ఐటీ కోర్ టీమ్ కానిస్టేబుల్స్ విజయ్, వెంకట్ గౌడ్, మహేందర్ గౌడ్, అలాగే వివిధ పోలీస్ స్టేషన్లలో సీఈఐఆర్ పోర్టల్ ద్వారా విశేష ప్రతిభ కనబరిచిన సిబ్బందికి ఎస్పీ ప్రశంస పత్రాలను అందజేసి, రివర్డ్ ప్రకటించారు. ఈ కార్యక్రమంలో మెదక్ జిల్లా అదనపు ఎస్పీ మహేందర్, డిసిఆర్బి ఇన్స్పెక్టర్ కృష్ణమూర్తి, ఐటీ కోర్ సిబ్బంది, సీఈఐఆర్ పోర్టల్ సిబ్బంది పాల్గొన్నారు.

## సాకేత్ కాలనీలో రియల్టర్ దారుణ హత్య

- **పాత కక్షలతో రియాల్టర్ ను హత్య చేసిన దుండగులు,**
- **దర్యాప్తు నిర్వహిస్తున్న జవహర్ నగర్ పోలీసులు**

**జవహర్ నగర్, డిసెంబర్ 8, ప్రజాస్వరం:**





జవహర్ నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో సోమవారం ఉదయం దారుణ హత్య చోటు చేసుకుంది. వెంకటరత్నం అనే రియల్ ఎస్టేట్ వ్యాపారని కొందరు గుర్తుతెలియని వ్యక్తులు దారుణంగా హత్య చేశారు. స్థానికుల సమాచారంతో సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు. ప్రాథమికంగా వెల్లడించిన వివరాల ప్రకారం స్థానికంగా ఉండే రియల్ ఎస్టేట్ వ్యాపారి వెంకటరత్నం ఉదయం తన కూతుర్ని ద్విచక్ర వాహనంపై పాఠశాలలో దింపి వస్తుండగా ఆటో, ద్విచక్ర వాహనంలో వెంబడించి సాకేత్ కాలనీ ఫోస్టర్ బిల్లా బాంగ్ స్కూల్ సమీపంలో నడిరోడ్డుపై వెంకటరత్నంపై కత్తులతో దాడితడి చేశారు. అనంతరం రివాల్వర్‌తో షూట్ చేసిఅక్కడి నుండి వెళ్ళిపోయారు. ఒక్కసారిగా తుపాకుల శబ్ధం వినిపడటంతో స్థానికులువెంటనే పోలీసులకు సమాచారం అందించారు. సంఘటన స్థలానికి చేరుకున్నారు అప్పటికే తీవ్ర గాయాలు అయినా వెంకటరత్నం మృతి చెందాడు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు నిర్వహిస్తున్నారు.పాత కక్షలే ఈ హత్యకు కారణం అయ్యి ఉండొచ్చు అని పోలీసులు ప్రాథమికంగా నిర్ధారించారు. సంఘటనా హత్యకు ఉపయోగించిన ఒక కత్తితో పాటు బుల్లెట్ ను స్వాధీనం చేసుకున్నారు.



## నాగుసాన్ పల్లి గ్రామ సర్పంచ్ గా ఆంజనేయులు ఏకగ్రీవం

**మాసాయిపేట డిసెంబర్ 9(ప్రజాస్వరం)**

మండలంలోని గ్రామసర్పంచ్ గామంతూరి ఆంజనేయులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. గ్రామంలో 8 వార్డులు ఉండగా 1,5వ వార్డులు ఏకీకరమయ్యాయి. ఆంజనేయులపై పోటీచేసిన యువకుడుతననామినేషన్ ను విత్ డ్రాచేసుకోవడంతో ఆంజనేయులుఏకగ్రీవగా సర్పంచ్ గాఎన్నికయ్యారు అందరు కలిసి తనను ఏకగ్రీవంగాసర్పంచ్ గా ఎన్నుకున్నారని సర్పంచ్ ఆంజనేయులు అన్నారు. గ్రామ అభివృద్ధి కోసం తనుకృషిచేస్తానని గ్రామస్తుల నమ్మకంతో నన్ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నందుకు అందరికీ ధన్యవాదాలు తెలిపారు.

ప్రజాస్వరం
PRAJASWARAM
తెలుగు దినపత్రిక
09.12.2025
మంగళవారం | హైదరాబాద్
www.prajaswaramdaily.com




## పెద్దమందడిలో రోడ్ల దుస్థితిపై బీజేపీ ఆగ్రహం

**వనపర్తి, డిసెంబర్ 08(ప్రజాస్వరం):**

వనపర్తి ఎమ్మెల్యే సొంత నియోజకవర్గమైన పెద్దమందడి మండల రహదారులు గుంతల మయం అయి, రాత్రివేళల్లో ప్రజలు తరచూ ప్రమాదాలకు గురవుతున్నారని బీజేపీ జిల్లా అధ్యక్షుడు డి. నారాయణ ఆగ్రహం వ్యక్తం చేశారు. సోమవారం చిన్నమందడి గ్రామ పంచాయతీ సర్పంచ్ ఎన్నికల ప్రచారంలోని సభలో ఆయన మాట్లాడారు. ఎమ్మెల్యే సొంత మండలానికే రోడ్ల సౌకర్యం కల్పించలేని పరిస్థితి నెలకొంటే ప్రజలు ఎవరిని ఆశ్రయించాలని ప్రశ్నించారు. బస్సు సౌకర్యం వంటి ప్రాథమిక వసతులు అందించడంలో కూడా ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. “ఇలాంటి వారిని ఎమ్మెల్యేగా గెలిపించిన ప్రయోజనం ప్రజలకు ఏముంది?” అని డి. నారాయణ ప్రశ్నించారు. కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఆడిఆడిగా విమర్శించిన ఆయన... నిరుద్యోగులకు రాజీవ్ యువ వికాసం, మహిళలకు స్కూటీ, యువతకు నిరుద్యోగ భృతి, ఉద్యోగ పరీక్షలకు జాబ్ క్యాలెండర్ అంటూ ఎన్నో హామీలు ఇచ్చి... వాటిలో ఒక్కటి కూడా అమలు చేయకుండా యువతను మోసం చేసిందని మండిపడ్డారు. గ్రామీణాభివృద్ధి కోసం కేంద్ర ప్రభుత్వం పంపిస్తున్న నిధులతో గ్రామాలను సుజలాం-సుఫలాం చేయడానికి బీజేపీ కృషి చేస్తుందని తెలిపారు. “ప్రజలు ఇప్పటికే మోసపోయారు... కనీసం ఇప్పుడు అయినా కాంగ్రెస్‌కు తగిన బుద్ధి చెప్పాలి” అని నారాయణ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సంస్థాగత కార్యదర్శి కేతూరి బుడ్డన్న, జిల్లా నాయకులు రామ్మోహన్, జిల్లా మీడియా కన్వీనర్ గజరాజుల తిరుమలేష్, యువ మోర్చా నాయకులు రాజు, రవీందర్ రెడ్డి, బాలరాజు, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

## తిరుమలాయపాలెంలో కాంగ్రెస్ జోష్...
## ప్రచారంలో దూసుకెళ్తున్న అభ్యర్థులు

- **గ్రామ పంచాయతీ ఎన్నికల వేళ కాంగ్రెస్, ఎం.ఎల్ నేతల సంయుక్త బలం**
- **అభివృద్ధిని నమ్మి ఓటు వేయాలని ప్రజలకు పిలుపు**

**ఖమ్మం డిసెంబర్ 08(ప్రజాస్వరం):**

తిరుమలాయపాలెం మండల కేంద్రములో ఈ నెల 14వ తేదీన జరగనున్న రెండో విడత గ్రామపంచాయతీ ఎన్నికల వేళ తిరుమలాయపాలెం మండలంలో కాంగ్రెస్ పార్టీ, ఎం.ఎల్ పార్టీ బలపర్చిన అభ్యర్థులు ప్రచారాన్ని వేగవంతం చేశారు. మండల కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి గుర్రాల శ్రీనివాస్ రెడ్డి, మాజీ ఎంపీపీ బోడ మంగీలాల్, మురళి రెడ్డి ఆధ్వర్యంలో అభ్యర్థులు ప్రజల్లో విస్తృతంగా మమేకమవుతున్నారు. కాకరవాయి గ్రామ అభ్యర్థి కట్టకూరి శ్రీనివాస్ రెడ్డి, రాజారం అభ్యర్థి మందుల అరుణ, కేశవాపురం అభ్యర్థి కందుకూరి వెంకటేశ్వర్లు, బాలాజీనగర్ తండా అభ్యర్థి రమావత్ రమణ ఈ నలుగురూ గెలుపు సంకేతాలతో ఇంటింటికి తిరిగి కరపత్రాలు అందజేస్తూ ప్రజలను అభ్యర్థిస్తున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత గత రెండేళ్లలో విద్య, వైద్యం, వ్యవసాయం, ఇందిరమ్మ ఇళ్లు, మౌలిక వసతులు వంటి రంగాల్లో జరిగిన అభివృద్ధిని ప్రజలు గమనించి ఓటు వేయాలని నేతలు కోరారు. అధికార పార్టీకి మరింత బలం చేకూరితే ప్రాంతీయ అభివృద్ధి ఇంకా వేగంగా సాగుతుందని ప్రజలకు వివరించారు. పాలేరు నియోజకవర్గానికి మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి ఆధ్వర్యంలో ఎన్నో నిధులు సమకూరి తిరుమలాయపాలెం మండలంలో అన్ని వర్గాల కోసం సుస్థిర అభివృద్ధి జరిగిందని నాయకులు గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాల ఇన్‌చార్జులు మియా భాయ్, తాళ్లూరి రాము, ఇమామ్, తోట ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



# కాంగ్రెస్ అభ్యర్థుల గెలుపుతోనే
# గ్రామాల అభివృద్ధి సాధ్యం

- **మరో పదేళ్లు కాంగ్రెస్ ప్రభుత్వమే ఉంటుంది.**
- **బిఅర్ఎస్ కబ్జాకోరుల మాటను నమ్మి మోసపోకండి.**
- **పది సంవత్సరాల బి అర్ ఎస్ పాలనలో గ్రామాలలో ఒక్క ఇల్లు ఇవ్వలేదు.**
- **పది సంవత్సరాల్లో రేషన్ కార్డులు రాక ఇబ్బందులు ఎదుర్కొన్నాం.**
- **నేడు కాంగ్రెస్ ప్రభుత్వ హాయంలో గ్రామాల అభివృద్ధి చెందుతున్నాయి.**
- **ప్రస్తుతం కొనసాగుతున్న సర్పంచ్ ఎన్నికల్లో గెలుపు మీది అభివృద్ధి నాది**
- **మొదటి విడత ఎన్నికల ప్రచారంలో వనపర్తి శాసనసభ్యులు తూడి మేఘారెడ్డి.**

**వనపర్తి, డిసెంబర్ 08(ప్రజాస్వరం):**

కాంగ్రెస్ పార్టీ బలపరిచిన అభ్యర్థులను సర్పంచులుగా గెలిపిస్తేనే గ్రామాలు త్వరితగతిన అభివృద్ధి చెందుతాయని కబ్జాకోరుల మాటలు నమ్మి మోసపోతే ఇబ్బందులు ఎదుర్కొంటామని వనపర్తి శాసనసభ్యులు తూడి మేఘారెడ్డి పేర్కొన్నారు. మొదటి విడత ఎన్నికల ప్రచారంలో భాగంగా సోమవారం వనపర్తి నియోజకవర్గ పరిధిలో ఖిల్లా ఘణపురం మండలంలో ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఉప్పరపల్లి, సూరాయిపల్లి, దొంతికుంట తండా, మానాజీపేట, మల్కాపురం, గట్టు కాడిపల్లి, వెంకటంపల్లి, ఆగారం, ఖిల్లా ఘణపురం, మామిడిమాడ, సల్కెలాపురం గ్రామం తో పాటు పలు తండాలలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామానికి ప్రచారీకి వచ్చిన ఎమ్మెల్యేకు గ్రామస్తులు ఘనంగా స్వాగతం పలికారు.

ప్రజలు ఉత్సాహంతో నృత్యాలు చేస్తూ నుదుటన తిలకం దిద్ది మంగళహారతి ఇస్తూ మహిళలు సైతం ఎమ్మెల్యే కు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్రంలో మరో పదేళ్లపాటు కాంగ్రెస్ ప్రభుత్వమే అధికారంలో ఉంటుందని ప్రస్తుతం మూడేళ్లు తాను ఎమ్మెల్యేగా, రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రిగా, మల్లురవి ఎంపీగా ఉంటారని గ్రామాలు త్వరితగతిన అభివృద్ధి చెందాలంటే కాంగ్రెస్ బలపరిచిన అభ్యర్థులనే అఖండ మెజారిటీతో గెలిపించాలని ఎమ్మెల్యే సూచించారు. పదేళ్ల బిఅర్ఎస్ పాలనలో గ్రామాలలో ఒక్క ఇల్లు ఇవ్వలేదని ఒక్క రేషన్ కార్డు ఇవ్వలేదని కేవలం అభివృద్ధి పనుల మాటున అందిన కాడికి దోచుకున్నారే తప్ప గ్రామాలను పట్టించుకోలేదని ఎమ్మెల్యే విమర్శించారు. నేడు ఇందిరమ్మ రాజ్యంలో ప్రతి గ్రామంలో ఇల్లు లేని నిరుపేదలకు ఇందిరమ్మ ఇండ్లు, ప్రతి ఒక్కరికి రేషన్ కార్డులు. మహిళలకు వడ్డీ లేని రుణాలు, మహిళలకు ఆర్టీసీలు ఉచిత ప్రయాణం, మహిళా సమైక్యలకు ఆర్టీసీ బస్సులు కొనుగోలు, మన ఇంటికి ఉపయోగించే ఉచిత విద్యుత్తు,

రైతు భరోసా, రైతు రుణమాఫీ, హాస్టల్ విద్యార్థులకు మెస్ చార్జీల పెంపు, రైతులకు రాయితీపై విత్తనాలు యాంత్రిక పనిముట్లు లాంటి అనేక పథకాలు చేపట్టిందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ప్రస్తుతం కొనసాగుతున్న సర్పంచ్ ఎన్నికలలో ప్రతి గ్రామంలో కాంగ్రెస్ బలపరిచిన అభ్యర్థులను గెలిపిస్తేనే గ్రామాలలో పూర్తిస్థాయి అభివృద్ధి కొనసాగుతుందని మీరు గెలిచి వస్తే నేను అభివృద్ధి చేసి చూపిస్తానని ఎమ్మెల్యే అభ్యర్థులకు సూచించారు. విద్యాపరంగా ఇంటిగ్రేటెడ్ పాఠశాలలు, వైద్యపరంగా నూతన ఆసుపత్రుల నిర్మాణం, అంతర్గత రోడ్ల నిర్మాణం, విద్యుత్ సమస్యల పరిష్కారం, తాగునీటి సమస్యల పరిష్కారం, గ్రామాలలో మౌలిక వసతుల కల్పన లాంటి అనేక పనులు, చేపడుతున్నామన్నారు. గతంలో నుంచి కాంగ్రెస్ పార్టీతోనే అభివృద్ధి సాధ్యమవుతుందని ఇతరులను నమ్మి మోసపోకూడదని ఎమ్మెల్యే సూచించారు. కార్యక్రమంలో వనపర్తి వ్యవసాయ మార్కెట్ యార్డ్ అధ్యక్షులు శ్రీనివాస్ గౌడ్, ఘణపురం కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు విజయకుమార్, మాజీ ఎంపీపీ క్యామ వెంకటయ్య, వెంకట్రావు, జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు వాకిటి ఆదిత్య, వనపర్తి ప్రముఖ వైద్యులు పగిడాల శ్రీనివాస్, మాజీ సర్పంచులు మాజీ ఎంపీటీసీలు మహిళలు కార్యకర్తలు యువకులు పాల్గొన్నారు.





## బిఆర్ఎస్ పార్టీ ఇంటింటి ప్రచారం

**వలిగొండ డిసెంబర్ 08(ప్రజాస్వరం):**

యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండలం పరిధిలోని గోపరాజు పల్లి లో బిఆర్ఎస్ అభ్యర్థి ఇంటింటి ప్రచారము తిరుగుతూ నమూనా బ్యాలెట్ పత్రాలతో గుర్తులను ఓటర్లకు చూపిస్తూ ప్రచారం చేస్తున్నారు. ఇంటింటికి వెళ్లి అభ్యర్థులను టిఆర్ఎస్ పార్టీకే ఓటు వేయాలని అడుగుతున్నారు ప్రతి కుటుంబాలను కలిసి కేసీఆర్ చేసే సంక్షేమ పథకాలను గ్రామాల్లో చేపట్టిన అభివృద్ధి చూసి ఓటేయాలని వివరిస్తూ ప్రజలను ఓట్లు అడుగుతున్నారు.అందరికీ మేలు చేసిన కేసీఆర్ గుర్తుచేసుకొని ఓటు వేయాలని వేడుకుంటున్నారు. అందరికీ మేలు చేసిన కేసీఆర్ గుర్తు చేసుకోవాలని అంటున్నారు ఇక వచ్చేది మన ప్రభుత్వమే కేసిఆర్ వస్తాడు అధైర్యపడవద్దు అని గడప గడపకు చెప్పి ప్రచారం చేస్తున్నారు. తాను గెలిస్తే ఆ ప్రజలకు అందుబాటులో ఉండి అన్ని సమస్యలు పరిష్కరిస్తారని భారీ మెజారిటీతో గెలిపించాలని బిఆర్ఎస్ అభ్యర్థి నీలం నరేందర్ అన్నారు. ప్రజలు ఏ గడప దాటినా కెసిఆర్ చేసిన పనులను చూసి గోపరాజుపల్లి గ్రామస్తుడైన టిఆర్ఎస్ పార్టీ నరేందర్ కే మా ఓటు అని అంటున్నారు. ఈ కార్యక్రమంలో గాజులు అంజయ్య, సంగిశెట్టి చంద్రయ్య, మాణిక్యరావు, గణేష్, మనోహర్ విజయకుమార్, తదితరులు పాల్గొన్నారు.





## తాండాల్లో బీఆర్ఎస్ పార్టీ ఇంటింటి ప్రచారం

**వనపర్తి, డిసెంబర్ 08(ప్రజాస్వరం):**

సర్పంచ్ ఎన్నికల వేళ బీఆర్ఎస్ ప్రచారం వేగం పెంచింది. జిల్లా బీఆర్ఎస్ అధికార ప్రతినిధి, మాజీ మున్సిపల్ వైస్‌చైర్మన్ వాకిటి శ్రీధర్ పార్టీ నాయకులతో కలిసి శుక్రవారం వనపర్తి మండలంలోని నాచనహళ్లి, కిస్టగిరి, పెద్దగూడెం తాండాలను సందర్శించారు. పార్టీ అధిష్టానం బలపరిచిన అభ్యర్థులు శివకుమార్, కాటి పద్మ, శంకర్ నాయక్ తరపున ఆయన ఇంటింటి తిరిగి ఓట్లను అభ్యర్థించారు. పర్యటనలో మాట్లాడిన శ్రీధర్... మండల గ్రామాలకు సాగునీరు-తాగునీరు అందుబాటులోకి తెచ్చిన ఘనత మాజీ మంత్రి నిరంజన్ రెడ్డి దేనన్నారు. ప్రజాపాలన పేరిట ప్రభుత్వ ఖర్చులపై విమర్శలు గుప్పించారు. తాండలలో పోడు భూముల సమస్యను పరిష్కరించింది, పట్టాలు ఇచ్చింది కెసిఆర్ ప్రభుత్వమేనని పేర్కొన్నారు. సంక్షేమ పథకాల బకాయిలను తీర్చకుండానే ఓట్లు అడగడం సరికాదని కాంగ్రెస్ నాయకులను నిలదీశారు. ఆసరా పెన్షన్ రూ.4000, మహిళలకు రూ.2500, తులం బంగారం, నిరుద్యోగులకు ఉద్యోగాలు, విద్యా బరోసా, స్కూటీలు, కంటి వెలుగు, ధాన్యానికి బోనస్, రైతు కూలీలకు రూ.12 వేల వంటి హామీల అమలు విషయంలో కాంగ్రెస్ ప్రజలకు సమాధానం చెప్పాల్సిందేనని అన్నారు. నిరంజన్ రెడ్డి ప్రజాపాలన కొనసాగాలంటే బీఆర్ఎస్ బలపరిచిన అభ్యర్థులను గెలిపించాలని వాకిటి శ్రీధర్ కోరారు. కార్యక్రమంలో రవి ప్రకాష్ రెడ్డి, ధర్మ నాయక్, నారాయణ నాయక్, కృష్ణ నాయక్, చిట్యాల రాము తదితరులు పాల్గొన్నారు.

## రేవంత్ రెడ్డి సిద్ధిపేట అడుగు పెడితే “ హరీష్ ” తట్టుకోలేవ్...

- **హరిశ్ కి కాంగ్రెస్ నేత పూజల సవాల్**
- **వచ్చె ఎన్నికల్లో సిద్దిపేట లో బిఆర్ ఎస్ కాళీ**

**దుబ్బాక, డిసెంబర్ 08 (ప్రజాస్వరం):**




తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సిద్ధిపేట కి వస్తే నువ్వు తట్టుకోలేవ్ అని రాష్ట్ర యూత్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి పూజల గోపికృష్ణ చిన్నకోడూర్ మండలో సిద్దిపేట ఎం ల్ ఏ హరీశ్ రావు మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దమ్ముంటే సిద్దిపేట కురా అని సవాల్ చేశారు. ఈ సందర్భంగా గోపికృష్ణ మాట్లాడుతూ... తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పై ఇష్టం వచ్చినట్టు మాట్లాడుతే కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో తగిన బుద్ధి చెప్పాల్సిన అవసరం వస్తుంది జాగ్రత్త హరీష్ రావు అని క్యాంప్ కార్యాలయంలో జరిగిన సమావేశంలో మాట్లాడారు..బి ఆర్ ఎస్ ప్రభుత్వ హయాంలో మీరు చేసిన అవినీతి అక్రమాలు త్వరలోనే బయట పెట్టి మిమ్మల్ని జైలు కి పంపడం ఖాయం అని అన్నారు...కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాలు ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను చూసి జీర్ణించుకోలేక ప్రజలకు లేనిపోని మాయమాటలు చెపుతూ ప్రభుత్వం పై బురద చల్లే కార్యక్రమంలో ఉన్నారు కానీ ప్రజలు నిన్ను నమ్మే స్థితిలో లేరు అని అన్నారు...చేతిలో అధికారం లేకపోవటం తో మతిస్థిమితం తప్పి మాట్లాడుతున్నారు అన్ని అన్నారు.. తెలంగాణ లో బి ఆర్ ఎస్ కాళీ అయింది... త్వరలో నే సిద్ధిపేటలో కూడా కాళీ అవుతుంది గుర్తుపెట్టుకో అని వాక్యాలు చేసారు.మీరు చేసిన అవినితి అక్రమాలను ఆధారాలతో మేనిఫెస్టో రూపంలో త్వరలోనే చూపిస్తాం అని చెప్పారు.

# ప్రతిక్షణం ప్రజల కోసమే

- **బిఆర్ఎస్ అభ్యర్థి నీలం నరేందర్**

**వలిగొండ డిసెంబర్ 8(ప్రజాస్వరం):**

యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండలం గోపరాజుపల్లి లో బిఆర్ఎస్ అభ్యర్థి నీలం నరేందర్ మాట్లాడుతూ నన్ను భారీ మెజారిటీతో గెలిపించండి ప్రజలకు ఏ కష్టం వచ్చినా 24 గంటలకు మీకు అందుబాటులో ఉంటా ప్రజలకు అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలను అందరికీ అందేలా చేస్తా నీతి నిజాయితీగా పని చేస్తా అని అన్నారు. మన గ్రామంలో ప్రజల సమస్యలు తీర్చడానికి సిద్ధంగా ఉన్నాను. ప్రజలకు మెచ్చేలా నచ్చేలా పరిపాలన అభివృద్ధి సంక్షేమ అందిస్తానని బిఆర్ఎస్ అభ్యర్థి నీలం నరేందర్ అన్నారు. అభివృద్ధి వైపుగా నడిపించే బాధ్యత నాకు ఇవ్వండి నా గ్రామ ప్రజలకు సేవ చేయడానికి సిద్ధంగా ఉన్నాను అన్నారు. గ్రామాన్ని ఆదర్శ గ్రామంగా అభివృద్ధి చేస్తానని హామీ ఇచ్చారు. గ్రామంలో అందరి కష్టసుఖాలతో పాలుపంచుకొని సమస్యలు ఎప్పటికప్పుడు పరిష్కరిస్తానని అన్నారు. ప్రజాసేవ చేసే వ్యక్తులను మన గ్రామ ప్రజలు గుర్తించి ఆశీర్వదించి భారీ మెజార్టీతో గెలిపించాలని అన్నారు.



ప్రజాస్వరం PRAJASWARAM తెలుగు దినపత్రిక

09.12.2025
మంగళవారం | హైదరాబాద్
www.prajaswaramdaily.com



## గ్రామపంచాయతీ ఎన్నికలు నిశ్పక్షపాతంగా, ప్రశాంతంగా నిర్వహించాలి

- **జోగులాంబ జోన్ డిఐజీ ఎల్ఎస్ చౌహన్.**

**వనపర్తి, డిసెంబర్ 80(ప్రజాస్వరం)**




వనపర్తి జిల్లాలో గ్రామ పంచాయతీ ఎన్నికలను నిష్పక్షపాతంగా నిర్వహించాలని జోగులాంబ జోన్ డిఐజి ఎల్ ఎస్ చౌహన్ సూచించారు. సోమవారం వనపర్తి జిల్లా ఎస్పీ సునీత రెడ్డి, ఇతర పోలీసు అధికారులతో పోలీస్ కార్యాలయంలో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలలో పటిష్టమైన బందోబస్తు ఏర్పాటుచేయాలని, ఎన్నికల్లో ఇబ్బందులు కలిగించే వారిని అరెస్టు చేయాలని అధికారులను ఆదేశించారు. మద్యం అక్రమ రవాణాను చెక్ పోస్టుల ద్వారా అడ్డుకోవాలని, విలేజ్ పోలీస్ అధికారుల ద్వారా సమాచార వ్యవస్థ పటిష్టం చేయాలని డిఐజీ సూచించారు. డిఐజీ మాట్లాడుతూ, ప్రజలు భయం లేకుండా ఓటు హక్కును వినియోగించేందుకు ఫ్లాగ్ మార్చ్ ద్వారా పోలీస్ ఉనికిని గుర్తు చేయాలని, సమస్యాత్మక ప్రాంతాలలో ఎక్కువ సిబ్బందిని ఏర్పాటు చేసి పర్యవేక్షణ జరపాలని, ఎన్నికల తర్వాత విజయోత్సవ ర్యాలీలను అడ్డుకోవాలని చెప్పారు. సమీక్షలో వనపర్తిజిల్లా ఎస్పీ సునిత రెడ్డి, అదనపు ఎస్పీ వీరారెడ్డి, డీఎస్పీలు, సిఐలు పాల్గొన్నారు.

## ఒలింపిక్స్ పతకమే లక్ష్యం

- **అథ్లెట్ జ్యోతి ఎర్రాజీ**

**విశాఖపట్నం, డిసెంబర్ 08(ప్రజాస్వరం):**

ఒలింపిక్స్ లో పతకం సాధించడమే తన లక్ష్యమని భారత అగ్రశ్రేణి క్రీడాకారిణి జ్యోతి ఎర్రాజీ తెలిపారు. ఒలింపిక్ పతకం సాధించిన తర్వాత ప్రభుత్వ సహకారంతో విశాఖ లేదా రాష్ట్రంలో ఏదో ఒక చోట అథ్లెటిక్స్ అకాడమీ ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు. విశాఖ పోర్టు స్కూల్ పూర్వ విద్యార్థుల సంఘం (సాలగ్రామపురం) శివాజీ పార్కులో ఆదివారం నిర్వహించిన ఆత్మీయ సమ్మేళనంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. సాలగ్రామపురం పోర్టు స్కూల్ పూర్వ విద్యార్థిని అయిన జ్యోతి ఎర్రాజీ ఈ వేడుకలో పాల్గొని చిన్న నాటి స్నేహితులను కలుసుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పోర్టు స్కూల్ లో చదువుకుని క్రీడల్లో రాణిస్తున్నట్లు చెప్పారు. ప్రభుత్వం ఇటీవల అర్జున అవార్డు ప్రకటించినట్లు జ్యోతి తెలిపారు. అసోసియేషన్ అధ్యక్షుడు నాగనబోయిన నాగేశ్వరరావు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో ఆమె తన లక్ష్యాన్ని మిత్రులకు వివరించారు.



## జీవీఎంసీ అనుమతులు లేకుండా నిర్మాణం

**వేపగుంట, డిసెంబర్ 08(ప్రజాస్వరం)**



జోన్ 8,సచివాలయం 1086530, వార్డ్ 98 పరిధిలో ఉన్న అడవివరం వద్ద ఈ నిర్మాణం జరుగుతోంది. స్థానిక సచివాలయం ప్లానింగ్ సెక్రటరీ చందు సహకారంతోనే అనుమతులు తీసుకోకుండా నిర్మాణపు పనులు ప్రారంభించారు. జోన్ ఏ సి పి, టీ పి ఓ లకు తెలిసే నిర్మాణం జరుగుతున్నదని, ఇవ్వాల్సిన వాటా ఇచ్చేసారని తెలిసింది. ఈ వ్యవహారాన్ని అంతా ప్లానింగ్ సెక్రటరీ చందు చక్కబెడుతున్నాడని స్థానికంగా ఆరోపణలు వినబడుతున్నాయి. కమర్షియల్ నిర్మాణానికి అనుమతులు తీసుకోకుండా నిర్మించడం ద్వారా జీవీఎంసీ కి రావలసిన ఆదాయానికి గండిపడినట్లే. టౌన్ ప్లానింగ్ అధికారులు తమ స్వార్థం కోసం ఇటువంటి నిర్మాణాలను ప్రోత్సహిస్తున్నారని ప్రధానంగా సచివాలయం ప్లానింగ్ సెక్రటరీ ల ద్వారా అక్రమ నిర్మాణాలు జోరుగా సాగుతున్నాయని వీటిని అరికట్టాల్సిన బాధ్యత జీవీఎంసీ ఉన్నతాధికారులపై ఉన్నదనీ స్థానికులు గుర్తుచేస్తున్నారు.

## కళాకారులను సత్కరించిన డాక్టర్ కందుల

**టౌన్ కొత్త రోడ్, డిసెంబర్ 08(ప్రజాస్వరం):**

శ్రీ కనకమహాలక్ష్మి అమ్మవారి మార్గశిర మాసోత్సవాల సందర్భంగా ఆలయ ప్రాంగణంలో నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలలో పాల్గొన్న కళాకారులను విశాఖ దక్షిణ నియోజకవర్గం జనసేన పార్టీ నాయకులు, 32 వ వార్డు కార్పొరేటర్ డాక్టర్ కందుల నాగరాజు సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఏడాది అమ్మవారి ఉత్సవాల సందర్భంగా ఆలయ ప్రాంగణంలో నిర్వహిస్తున్న సాంస్కృతిక కార్యక్రమాల ద్వారా అమ్మవారి ఖ్యాతితోపాటు తెలుగు వారి సాంస్కృతిక సాంప్రదాయాలను తెలియజేయడం జరుగుతుందన్నారు. ఆలయ ఈవో శోభారాణి ఆధ్వర్యంలో ఉత్సవ కమిటీ నేతృత్వంలో నిర్వహిస్తున్న ఈ కార్యక్రమాలకు భక్తుల నుంచి అలాగే స్థానిక ప్రజల నుంచి అనూహ్య స్పందన వస్తుందన్నారు. మంచి కార్యక్రమాలకు ఎప్పుడు మంచి స్పందన ఉంటుందని తెలియజేశారు. సాంస్కృతిక కార్యక్రమాల ప్రదర్శనలు పాల్గొన్న వారందరికీ అమ్మ వారి ఆశీస్సులు పుష్కలంగా ఉండాలని అభిలాషించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో శోభారాణి, ఈ ఈ సిహెచ్ వి రమణ, ఏఈఓ లు నరేంద్ర, రాజేంద్ర తదితరులు పాల్గొన్నారు.

## ఆపదలకు అందరివాడు పెంటన్న యాదవ్.

- **జగత్ పల్లిలో సామాజిక, వ్యక్తిగత సేవలతో ప్రత్యేక గుర్తింపు.**
- **సర్పంచ్ అభ్యర్థిగా ప్రచారంలో దూసుకుపోతున్న పెంటన్న యాదవ్.**
- **గెలుపు ఖాయం.. ఎన్నికలే తరువాయి అంటున్న గ్రామస్తులు.**

**పెద్దమందడి డిసెంబర్ 08(ప్రజాస్వరం):**



ఆపతి సాపతికి అందరికంటే ముందుండే పెంటన్న యాదవ్ సర్పంచ్ అభ్యర్థిగా బరిలో నిలిచి ప్రచారంలో ముందుకు దూసుకుపోతున్నారు. హంగు ఆర్భాటంతో ఓటు హక్కు వచ్చి ఏండ్లు గడవకముందే ప్రచారం తప్పా ప్రజలపై ధ్యాసలేని అనేకమంది నాయకులను చూస్తుంటాం. కానీ అందరితో కలివిడిగా ఉంటూ ఊరిలోని ప్రతి సమస్యను తన సమస్యగా భావిస్తూ చావు, పుట్టుక నుంచి అసాధారణ సమస్యల వరకు అన్నీ తానై భావించే వ్యక్తిగా పెంటన్న యాదవ్ కు జగత్ పల్లి లోనే కాకుండా పెద్దమందడి మండలంతో పాటు చుట్టుపక్కల గ్రామాల్లో కూడా మంచి పేరు, గుర్తింపు ఉంది. సుదీర్ఘ కాలంగా ఆర్టీసీలో విధులు నిర్వహిస్తూనే గ్రామంలో సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తూ వస్తున్నారు. ఉద్యోగ విరమణ తర్వాత పూర్తి స్థాయిలో గ్రామంలో ప్రజల మధ్యనే ఉంటూ ప్రజాసేవ కాంక్షతో రాజకీయాల్లో చేరి కాంగ్రెస్ పార్టీకి కొన్నిళ్ళుగా మండల పార్టీ అధ్యక్షుడిగా వ్యవహరిస్తున్నారు. ఊరిలో బలగం లేని నిరుపేదలు మృతి చెందినా, కరోనా సమయంలో మృతి చెందిన బాధితులను సొంత కుటుంబీకులే అంత్యక్రియలకు భయపడినప్పటికీ పెంటన్న యాదవ్ ముందుండి అంత్యక్రియల్లో పాల్గొంటూ నేనున్నానంటూ భరోసా ఇస్తూ వచ్చాడు. సమస్య పరిష్కారంలో వివాదాలు సృష్టించే నాయకులకు భిన్నంగా సమస్యనే పరిష్కరించే వ్యక్తిగా పెంటన్న యాదవ్ గుర్తింపు తెచ్చుకున్నారు. అలాంటి పెంటన్న యాదవ్ ఎమ్మెల్యే మేఘారెడ్డి సొంత మండలం అయిన పెద్దమందడి మండలంలోని జగత్ పల్లి సర్పంచ్ అభ్యర్థిగా బరిలో నిలిచాడు. గ్రామంలో కులాలకతీతంగా అత్యధికులు పెంటన్న సేవలను గుర్తు చేసుకుంటూ గెలిపించేందుకు ముందుకు సాగుతున్నట్లు క్షేత్రస్థాయిలో తెలుస్తోంది. గతంలో గ్రామంలో సర్పంచ్ లుగా కొనసాగి ప్రజా సేవలో గట్టి పట్టున్న నాయకులు సైతం పెంటన్న యాదవ్ లాంటి నిఖార్సైన వ్యక్తికి మద్దతు ఇస్తుండడంతో ప్రత్యర్థుల్లో వణుకు మొదలైంది. జగత్ పల్లి గ్రామం నుంచి బ్రతుకుతెరువు నిమిత్తం, ఉద్యోగ, వ్యాపార రీత్యా వివిధ ప్రాంతాల్లో స్థిరపడిన వారు సైతం పెంటన్న యాదవ్ గెలుపు కోసం ప్రాంతాలను వదిలి సొంత ఊరికి తరలివచ్చి ఓటు వేసి గెలిపించేందుకు తహతహలాడుతున్నట్లు తెలుస్తోంది.

## కబుర్లు ఎక్కువ... కార్యాచరణ తక్కువ.

- **రాష్ట్రానికి పెట్టుబడుల ప్రవాహం ప్రచారం పై సిపిఎం పొలిట్ బ్యూరో సభ్యులు బివి రాఘవులు.**
- **'ఉక్కు' ప్రతిష్టను దిగజార్చి వదిలించుకునే కుట్రలు సాగనివ్వం**
- **పాలకవర్గ విధానాల ఫలితమే! ఇండిగో సంక్షోభం... బివి రాఘవులు**

**విశాఖపట్నం, డిసెంబర్ 8(ప్రజాస్వరం):**




రాష్ట్రం పారిశ్రామికంగా శరవేగంగా ముందుకెళ్లిపోతుందని రూ. లక్షల కోట్లు పెట్టుబడులు, లక్షల ఉద్యోగాలంటూ చంద్రబాబు ప్రభుత్వం కబుర్లు ఎక్కువగా చెప్పి అందుకు తగ్గట్లు కార్యాచరణ లేకుండా వ్యవహరిస్తుందని సీపీఎం పొలిట్ బ్యూరోసభ్యులు బివిరాఘవులు ఎద్దేవా చేశారు. ఈ కబుర్లు ఈనాటివి కావని సిఐఐ సమ్మిట్లతో రూ. లక్షల కోట్లు వచ్చి పడిపోతున్నాయని చంద్రబాబు ముఖ్యమంత్రిగా తొలినుంచీ ఇవే చెబుతున్నారన్నారు. విశాఖలోని జగదాంబ సిఐటియు కార్యాలయంలో సోమవారం ఉదయం 7 గంటలకు సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కె లోకనాథం, విశాఖ జిల్లా కార్యదర్శి ఎం జగ్గు నాయుడు సంయుక్త ఆధ్వర్యాన నిర్వహించిన ప్రెస్ కాన్ఫరెన్స్లో రాఘవులు మాట్లాడుతూ గతంలో వేల ఏకరాల భూములను రైతుల నుంచి తీసుకున్నా, కార్పొరేట్ల వల్ల ఏం ఒరిగిందని ఆ భూముల్లో గడ్డి తుప్పలు మాత్రమే మొలిచాయని, ఏ పరిశ్రమా రాలేదని వ్యాఖ్యానించారు. భూముల కోసం తప్ప పెట్టుబడి ఆసక్తి కనిపించడం లేదన్నారు. పైగా దేశంలోనే విదేశీ పెట్టుబడులు గడచిన 2 ఏళ్లలో రాష్ట్రానికి వచ్చిందేమీ లేదన్నారు. ఐటి మంత్రి లోకేష్ కూడా గడచిన 17 నెలల్లో రూ.20లక్షల కోట్లు పెట్టుబడులను ఆకర్షించాడనడం, ఈ డబ్బంతా ఎక్కడికి వెళ్లిపోయిందో చెప్పాలని నిరంతరమైన కార్యాచరణ బదులు ఊదరగొట్టడం బాబు, పవన్, లోకేష్కు అలవాటుగా మారిందని రాఘవులు వ్యాఖ్యానించారు. 20142024 మధ్యకాలంలో రాష్ట్రానికి పెట్టుబడులు వచ్చింది 2 బిలియన్ డాలర్లేనన్నారు. రాగల 5 ఏళ్లలో అంటే 20242029 నాటికి 600 బిలియన్లు వస్తాయన్న ప్రచారం 'హెచ్చులు'గా కొట్టిపాడేశారు. భూములు తీసుకోడానికి ఊదరగొట్టడం తప్ప ఇంకేమీ కాదన్నారు, 20ఏళ్ల క్రితం రైతుల నెల్లూరు జిల్లా కృష్ణపట్నంలో అదానీ కోసం 2800 ఎకరాలు, కాకినాడలో సెజ్ ల పేరుతో 10వేల ఎకరాలు, అనంతపురంలో 8వేల ఎకరాలు లేపాక్షి కోసం, ప్రకాశం జిల్లా పనుకొండలో 80వేల ఎకరాలు ఇచ్చిన సంగతిని ఉటంకిస్తూ ఈ భూములన్నీ పెట్టుబడిదారుల స్పెక్యులేషన్ వ్యాపారానికి వాడుకున్నారు తప్ప ఈ ప్రాంతాల్లో ఏ పరిశ్రమ వచ్చిందని, భూములిచ్చిన రైతులకు ఏం పరిహారం ఇచ్చారంటూ ప్రశ్నించారు.

**డేటా సెంటర్లు అవసరమే కానీ.**

డేటా సెంటర్లు అవసరమే కాని అందులో వచ్చే ఉద్యోగాలు 300 కంటే మించవని, గూగుల్ కి చౌకగా నీరు, విద్యుత్ ఇవాల్సిన అవసరం లేదన్నారు. గ్రీన్ ఆనర్జీ ప్రాజెక్టు పేరుతో గాలి, నీరు వారి ప్రయోజనం కోసం తప్ప ఉపాధి కల్పించేవి కాదన్నారు. ఆధాని కోసమో టాటా కోసమో కాదని, రాష్ట్రం కోసం నిజంగా ఉపాధి కల్పించాలనుకుంటే ప్రపంచంలో ఉపాధి సృష్టించగల ఫుట్వేర్, గార్మెంట్, టెక్స్టైల్ ఇండస్ట్రీ, ఫుడ్ ప్రాసెసింగ్ పరిశ్రమలు పెట్టాలని రాఘవులు డిమాండ్ చేశారు. కాబట్టి ఇప్పటికే సేకరించిన భూములపై పరిశ్రమలు పెట్టేందుకు కేంద్రీకరించాలని రాష్ట్ర ప్రభుత్వానికి సిపిఎం సలహాఇస్తుందన్నారు. రాష్ట్ర భవిష్యత్ కోసం భూములు ఇవ్వాలే తప్ప అది ఆ భూములిచ్చే రైతులకు ఉపయోగపడాలన్నారు. చంద్రబాబు పాలనలో ఏపీ అభివృద్ధి సాధిస్తుందన్న కబుర్లు నిజం కావని, తెలంగాణ విడిపోయిన తర్వాత రాష్ట్రం కూడా అభివృద్ధి అయ్యిందేమీ లేదన్నారు. మహారాష్ట్ర, కర్నాటక, తమిళనాడు, గుజరాత్, యూపి దేశంలో ముందుకెళ్తున్నాయి కానీ ఎక్కువ కాలం చంద్రబాబు సీఎంగా ఉండి ఇంకా కబుర్లు చెప్పడం సరైంది కాదన్నారు.

**జీతాలకు ఉత్పత్తి ముడి పెట్టడం విశాఖ ఉక్కును దిగజార్చడానికే.... రాఘవులు మండిపాటు.**

విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రతిష్టను దిగజార్చి, కార్మికుల జీతాల్లో కోత పెట్టడానికి యాజమాన్యం ఉత్పత్తితో లింకు పెట్టి ఉద్యోగాలను కార్మికులు అంతిమంగా పదులుకునేలా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు, యాజమాన్యం చేస్తున్నాయని మండిపడ్డారు. ప్రభుత్వ రంగంలో ఉంటుందని చెబుతూనే ప్లాంట్ కు అన్ని నాశిరకం కోక్, పిల్లెట్స్ ముడిపదార్థాలే సరఫరా చేస్తున్నారని, నాణ్యమైన ఉక్కు ఉత్పత్తి చేయలేకపోతున్నారంటూ కార్మికులపై నింద మోపడం సరికాదన్నారు. ఉద్యోగులను నైతికంగా దెబ్బతీసే కుట్రలను ప్రభుత్వం కొనసాగిస్తున్నదని సంవత్సరం నుండి నాలుగు వందల శాతం జీతాలు బకాయి పెట్టిందన్నారు. ఇలా పొగపెట్టి పొమ్మనేలాగ చేస్తుంటే అనివార్యంగా ఉద్యోగులు బయటకు పోతున్న స్థితి నెలకొందన్నారు. నిర్వాసితులకు 8వేల మందికి ఇంకా ఉపాధి కూడా ఇవ్వలేదని భూమైనా ఇవ్వండి,పర్మినెంట్ ఉపాధి అయినా ఇవ్వండని నిర్వాసితుల డిమాండ్ న్యాయమైనదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే కేంద్రంపై ఒత్తిడి తెచ్చి నిర్వాసితుల సమస్యను పరిష్కరించడానికి చర్చలు జరపాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని రాఘవులు డిమాండ్ చేశాడు.

**కీలక రంగాల్లో ప్రభుత్వ నియంత్రణలో ఉండాలి**

విమానయాన సంక్షోభంపై రాఘవులు.. దేశంలోని కీలక రంగాల్లో ప్రభుత్వ ఆధిపత్యం ఉండి తీరాలని ప్రైవేట్ వాళ్ల పెత్తనానికి వదిలేస్తే తాజాగా నెలకొన్న విమానయాన రంగం ఎలా కకావికలం అయ్యిందో దేశం అంతా చూస్తున్నదన్నారు. ఇది కచ్చితంగా పాలకవర్గ విధానాల వల్ల వచ్చిన సంక్షోభమని రాఘవులు ఎద్దేవా చేశారు. కేంద్రం 2 ఏళ్ల క్రితమే పైలట్లు ఎలా ఉండాలో నిబంధనలు జారీచేసిందని ఇండిగో వాటిని అమలు చేయలేదన్నారు. అయినా కేంద్రం తగిన రీతిలో స్పందించకపోవడం వెనుక ప్రైవేట్ విమానయాన సంస్థతో కుమ్మక్కయిందా? అని ప్రశ్నించారు. ఇవే అదునుగా మరో ఎయిర్స్ టాటా ఎయిర్ ఇండియా ప్రస్తుతం రూ.10 వేలున్న టికెట్ను రూ. లక్ష చేసి వ్యాపారం చేసుకోవడం చూస్తే ప్రైవేట్ ఆధిపత్యం ఎంత ప్రమాదమో స్పష్టమౌతుందన్నారు.

## పోతుగల్ గ్రామాభివృద్ధి మరియు తండాల అభివృద్ధికి కృషి చేస్తాను

**రంగారెడ్డి ప్రతినిధి, నవంబర్ 8, ప్రజాస్వరం:**

షాబాద్ మండల పరిధిలోని పోతుగల్ గ్రామంలో సోమవారం కాంగ్రెస్ పార్టీ సర్పంచ్ అభ్యర్థి పామేనా నర్సింలు కత్తెర గుర్తుకు ఓటు వేయాలని పోతుగల్ గ్రామంలో ఇంటింట ప్రచారం చేసి తమ గుర్తు కత్తెర గుర్తు అని ఓటర్లకు వివరించారు, కత్తెర గుర్తుకు ఓటేసి తమను పోతుగల్ గ్రామ సర్పంచిగా గెలిపిస్తే గ్రామాభివృద్ధిని అన్ని దిశల్లో పూర్తి చేస్తానని ఓటర్లకు హామీ ఇచ్చారు, ప్రస్తుతం పోతుగల్ గ్రామంలో నెలకొన్న సమస్యలను తీర్చిదిద్దుతానని పోతుగల్ గ్రామ ప్రజలకు ఆయన హామీ ఇచ్చారు, ప్రస్తుతం పోతుగల్ గ్రామం అన్ని రంగాల్లో వెనుకబడి ఉందని తనను సర్పంచిగా ఎన్నుకొని కత్తెర గుర్తుకు మీ అమూల్యమైన ఓటు వేసి గ్రామాభివృద్ధి కి పాటుపడతానని ఆయన పోతుగల్ గ్రామం ప్రజలకు హామీ ఇచ్చారు, స్పందించిన పోతుగల్ గ్రామ ఓటర్లు కత్తెర గుర్తుకు ఓటు వేసి భారీ మెజార్టీతో గెలిపిస్తామని హామీ ఇచ్చారని పేర్కొన్నారు, తండాల్లో ముమ్మరంగా ప్రచారం, పోతుగల్ గ్రామపంచాయతీ పరిధిలో ఉన్న చిన్న తండా పెద్ద తండా గ్రామాల్లో ఎన్నికల ప్రచారం సోమవారం ముమ్మరంగాచేపట్టారు, తమ గుర్తు కత్తెర గుర్తు అని కత్తెర గుర్తుకు ఓటు వేయాలని ఓటర్లకు సూచించారు, అదేవిధంగా ఎన్నో సంవత్సరాలుగా మన తాండాల అభివృద్ధి కోసం మన కష్టసుఖాల కోసం సరైన నాయకత్వం లేక చాలా ఇబ్బంది పడ్డామని పోతుగల్ పంచాయతీ పరిధిలోని తండాలో ఓటర్లను ఉద్దేశించి మాట్లాడారు అదేవిధంగా ప్రస్తుతం మన తాండాలకు కనీసం రోడ్ సౌకర్యాలు లేవు, మంచినీటి ఎద్దడి చదువుల కోసం పిల్లలు పడే కష్టాలు మనందరికీ తెలిసినవేనని అయినప్పటికీ మీరు కత్తెర గుర్తుకు ఓటేసి పోతుగల్ సర్పంచ్ అభ్యర్థిగా ఎన్నుకుంటే నేను తండాల అభివృద్ధికి కట్టుబడి ఉండి అభివృద్ధి పనుల్లో పాల్గొంటానని ఆయన స్పష్టం చేశారు మౌలిక సదుపాయాలు, పోతుగల్ పంచాయతీ పరిధిలో ఉన్న తండాల్లో ప్రతి వీధికి సిమెంటు రోడ్డు వేయించి పల్లెకు ప్రధాన రహదారి కి కలుపుతానని తాండల్లోని ప్రజలకు ఆయన హామీ ఇచ్చారు, మంచినీరు మరియు పారిశుధ్యం, పోతుగల్ పంచాయతీ పరిధిలోని చిన్న తండా పెద్ద తండా లో ప్రతి ఇంటికి ప్రభుత్వపరంగా త్రాగునీటి సౌకర్యం కోసం కృషిచేసి తండాల్లో మురుగు కాలువల వ్యవస్థ ను ను రూపు రూపు మాపుతానని తండా ప్రజలకుహామీ ఇచ్చారు, విద్య మరియు సంక్షేమం, మన లంబాడి పిల్లలు బాగా చదువుకోవాలి దీనికోసం ప్రభుత్వం ఇచ్చే అన్ని స్కాల షిప్ లు,పుస్తకాలు అందేలా ప్రత్యేక సద్ద తీసుకొని అభివృద్ధి కార్యక్రమంలో పాలుపంచుకుంటానని ఓటరులకు హామీ ఇచ్చారు, ప్రభుత్వ పథకాలు, పోతుగల్ పంచాయతీ పరిధిలోని తండాల్లోని ప్రజలకు ప్రభుత్వం నుండి వచ్చే వృద్ధాప్య పింఛన్లు, వితంతు పింఛన్లు, ఆసరా పింఛన్లు ఇల్లు లేని నిరుపేద ప్రజలకు ఇల్ల నిర్మాణ పథకాలు తదితర లాంటివి మధ్యవర్తిత్వం లేకుండానే నేరుగా తాండాలోని ప్రజలకు అందేలా అందేలా కృషి చేస్తానని తండాలోని ప్రజలకు కాంగ్రెస్ పార్టీ బలపరిచిన సర్పంచ్ అభ్యర్థి కత్తెర గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని ఆయన ఓటర్లకు విజ్ఞప్తి చేశారు, మన సంస్కృతి గౌరవం, మన ఆరాధ దైవమైన సంత్ శ్రీ సేవాలాల్ మహారాజ్ ఆలయ నిర్మాణ అభివృద్ధికి అదేవిధంగా సాంస్కృతి భవనం నిర్మాణానికి ప్రత్యేక నిధులు ప్రభుత్వము నుండి పోరాడి లంబాడి తండాలో ఓటర్లకు ఇచ్చిన మాట ప్రకారం మాట నిలబెట్టడం ఖాయమని ఆయన ధీమా వ్యక్తం చేశారు, కావున ప్రతి ఓటరు కత్తెర గుర్తుకు ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని పోతుగల్ తాండాలోని ప్రతి ఓటరుకు ఆయన విజ్ఞప్తి చేశారు ఇది ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు పోతుగల్ గ్రామ కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు యువకులు తదితరులు ఈ ప్రచార కార్యక్రమంలో పాల్గొన్నారు.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY PURAM MAHESHWAR PRINTED AT HARI HARA ART PRINTERS, H.NO. 6-185, TOOPRAN, DIST. MEDAK, TELANGANA-502336. AND PUBLISHED AT H.NO. 4-50/18, KALLAKAL, VILL-KALLAKAL,(PO), KALLAKAL, (M) MANOHARABAD, DIST, MEDAK, TELANGANA-502336,
EDITOR: PURAM MAHESHWAR. RNI NO : TELTEL/2006/17154, CELL : 8008609999